శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై!   సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబూజీ కీ జై!



అది శిరిడీ... శ్రీసాయినాథుని ప్రేమ లోగిలి.
1954 సం॥ అక్టోబర్ 7వ తేదీ... గురువారం.. విజయదశమి..
36వ బాబా పుణ్యతిథి మహోత్సవం... సమాధి మందిరంలో
సజీవకళ ఉట్టి పడే శ్రీసాయిబాబా విగ్రహప్రతిష్ఠ

సకలసృష్టి, జగత్తుకు రూపశిల్పి అయిన శ్రీసాయి
తన అవ్యాజ ప్రేమనంతా పోది చేసి
మలచిన ఓ మహత్తర మహోన్నత
మూర్తిమత్వానికి ప్రాణప్రతిష్ఠ
దక్షిణ భారతంలో సాయితత్వ భావనా బీజాలకు
అంకురార్పణ జరిగిన మైలాపూర్ సెయింట్ ఇసబెల్లా
ఆసుపత్రిలో.... ప్రభవించినది సాయితేజం... - శ్రీబాబూజీగా
శ్రీసాయితో... శ్రీబాబూజీకి ఉన్న దివ్యానుబంధం.
అందుకే ఈ దినం సుదినం... పర్వదినం...
అందరికీ... మనందరికీ...



విజయదశమి సంచిక

# గురుకృప

నిరాడంబర జీవనం - ఉన్నత ఆలోచనా పథం

# అవగాహన

స్కూలుకి పోయేటటువంటి పిల్లలకు చాక్లెట్ ఇవ్వడం లాగా, బాబా మనకు ఇచ్చేటటువంటి రక్షణ, ఈ అనుభవాలంతా కూడాను. చాక్లెట్ ఇస్తే స్కూలుకు, ఆయన దృష్టిలో మాత్రం స్కూలుకి పోవటం. మనం పిలల్లకు చాక్కెట్లు, సైకిల్ కొనిస్తామంటే ఉద్దేశ్యం ఏమిటి? స్కూలుకు పోయి చక్కగా చదువుకుంటారని. చాక్లెట్ తినేసి స్కూలుకు పోలేదనుకో, కొన్ని రోజులు ఆపుతాము చాక్కెట్లు. రెండోరోజు, చాక్లెట్ ఇవ్వు అనంటే, నేనివ్వను, పోతేపో, లేకపోతే లేదు అంటాము. లేదు, లేదు, లేదు డాడీ పోతాను, పోతాను అని చెపితే చాక్లెట్ ఇస్తాము. కాబట్టి బాబా మనకీ అనుభవాలంతా ఎందుకు ఇస్తున్నారో తెలుసుకుంటే, మనకి అన్నీ క్లియర్ అవుతాయి.

ఈ లోపల మనమేమి చేస్తున్నాం? దాన్ని తీసేసుకొని చాక్లెట్ తినేసేసి గుట్టుగా ఉంటున్నామా? దాంట్లోంచి ఏమన్నా నేర్చుకున్నామా? బాబాకు దగ్గరయ్యే దానికోసరంగా మన ప్రయత్నాలు మనమేమన్నా చేశామా? మనలో అవగాహన పెంచుకున్నామా? అదొక్కసారి చెక్ చేసుకోండి.

నేను స్కూలుకు పోకపోయినా చాక్లెట్లు ఇస్తాడులే మా డాడీ అనుకోవడం ఓవర్ కాన్ఫిడెన్స్ అవుతుంది. బాబా ఎందుకు మనకీ అనుభవాలు ఇస్తున్నారు. ఆయన మననించి ఏం ఆశిస్తున్నారు? మన నడవడికలో, మన ఆలోచన పంథాలో, మన అవగాహనలో, మన ఆలోచనాసరళిలో ఏమేమి మార్పులు తెచ్చుకోవాలి. ఆ మార్పులు మనం తెచ్చుకుంటున్నామా? ప్రతి ఒక్కరూ ఆత్మ పరిశీలన చేసుకుంటే తెలుస్తుంది. ఎందుకు డిలే అవుతున్నాయి కొన్ని అనేది.

మనం కోరుకొన్నటువంటివి డిలే అవుతుంటాయి, ఈ చాక్లెట్లు డిలే అవటంలాంటిదది. ఒక రెండురోజులు గ్యాప్ ఇస్తే కాని మనం కరెక్టుగా సెట్ అవ్వం. ఏమిటి దీంట్లో, ఆయన మనకు ఎందుకు రక్షణ ఇవ్వాలి, బాబాకు మనకు ఉండేటటువంటి సంబంధం ఏమిటి? దీనిపట్ల మనకు అవగాహన పెరిగితే ఈ డిలే తగ్గిపోతుంది.

మనకు మన కర్మానుసారంగా భోరున కుంభవృష్టిలాగా కురుస్తోంది, కష్టాలనేటటువంటి వర్షం, బాబా అనుగ్రహం అనేటటువంటిది గొడుగులాగా మనల్ని ఆదుకొంటోంది. ఆ గొడుగు తీసేస్తే తడుస్తాము, గొడుగు తడపలా మనని, ప్రత్యేకంగా తడపడానికి, చూడు, గొడుగు చూడు తడిపి పారేసింది ప్రక్కకుపోయి అనంటే ఎట్లా? గొడుగు సరిగా పట్టుకుంటే తడవకుండా ఉంటాము. ముందు దీనికి సంబంధించి ఆలోచించండి. మన ఆలోచనే, మనకు కష్టం ఎందుకు వస్తోంది? కష్టం ఎలా తీరింది? బాబా మన కష్టం ఎందుకు తీర్చాలి? ఈ తీర్చడం ద్వారా మనవైపునించి మనం ఏ రకంగా ఉండాలి? మనకు, ఆయనకు ఉండేటటువంటి కనెక్షన్ ఏమిటి?

ఈ సంబంధాన్ని ఇంకా కూడాను స్ట్రాంగ్‌గా చేసుకోవడానికి, ఎట్లా మనం చేసుకోవాలి? (మనం ఏమి చేయాలి) వీటి గురించి ఆలోచిస్తే తెలుస్తుంది. ఈ ఆలోచించేదానికి, ఈ మనం పారాయణ, పుస్తకాలు చదువడం, ఇట్లా (శిరిడీ) రావడం ఇవన్నీ కూడాను దోహదం చేస్తాయి అంతే. కాని ఇదొక్కటే చాలదు. మన ఆలోచన కావాలి. ఈ ఆలోచనలోంచి మనకు ప్రేమ పుడుతుంది. ఈ ప్రేమ ఉంటే ఇంకా ఏమీ అవసరం లేదు.

శ్రీబాబూజీ

సంపుటి : 16
అక్టోబర్ 13

# గురుకృప

సంచిక : 4
2013



## సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృత ధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృత ధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్య ప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

- శ్రీబాబూజీ



## లోపలి పేజీలలో

ప్రార్థన 4
- గురుకృప

ఆర్తి 8
- శరశ్చంద్రికలు

విద్యాసక్తి 13
- శరశ్చంద్రికలు

నమ్మకం 20
- శరశ్చంద్రికలు

సమదర్శనాన్ని సాధించు! 27
- పార్థసారధి ప్రవచనాలు

తృప్తి 29
- శ్రీరమణాశ్రమ లేఖల నుంచి

నిర్వహణ : **గురూజీ ఆశీస్సులతో - గురుబంధువులు**

GURUKRUPA, 2-1-6, Gandhi Chowk, Tenali-01.
Ph : 93933 61778
Printed at : Ramakrishna Printers, Visakhapatnam.

# ప్రార్ధన



"సర్వత్రా సర్వజీవులలోనూ ప్రకాశించే చైతన్యాన్ని మనచే దర్శింపచేయడమే శ్రీసాయి ద్వారా ప్రకటమైన లీలా ప్రబోధాల యొక్క పరమార్ధం. ఆ సత్యాన్ని దర్శించడమే సాయిభక్తుల సాధన లక్ష్యం" అంటారు శ్రీబాబూజీ. సాయితత్త్వమెరిగి, సాయితత్త్వసాధనలో, జీవిత పరమార్థపు శోధనలో తన తనువు, మనసులను సాయికి త్రికరణశుద్ధిగా సమర్పించి, సాయినే సర్వంగా అర్చించిన సద్గురుదేవుల సమున్నత సందేశమిది సాయిభక్తులకు. అస్తవ్యస్తంగా మారుతున్న మానవ జీవితాలకు చుక్కానిలా, లక్ష్య శుద్ధిని, దిశానిర్దేశాన్ని చేసిన మహామహితాత్ములు శ్రీబాబూజీ. సర్వజీవులలో ప్రకాశిస్తున్న 'సాయి'ని దర్శించడమంటే సులభమా? అన్న మీమాంస రాగానే, క్షమించండి రావడమంటేనే అడుగు ముందుకు వేసినట్లు! సరే! మస్తిష్కానికి అందిన ఆలోచనలు – సచ్చరిత్ర ఒక వందసార్లు చదివితే! శిరిడీ యాత్ర ఒక ఐదువందలసార్లు చేస్తే? ఒక పుష్కరకాలం ప్రతి గురువారం ఒక్కపొద్దు ఉంటే?... సర్వమూ సాయిరూపంగా దర్శనమిస్తుందా? ఇవన్నీ చేసిన పూర్వీకులు, సమకాలికులు,... అందరూ కళ్లముందు మెదిలారు. వైఫల్యాలేగాని, సద్గురుపథంలో సాఫల్యాలు సందర్శించని పరిస్థితి. అప్పుడు గుర్తొచ్చింది – తన బిడ్డల ప్రగతినే పరమార్ధంగా ఎంచి, ద్వారం వద్ద ఎదురుచూచే తల్లి, సాయి మాయిని మనఃపూర్వకంగా 'ప్రార్థించడమే' సముచితమైన, సమున్నతమైన మార్గమని!

**ఏది ప్రార్ధన :** భాష తెలియక, బంధమెరుగక, భావము తెలియక – ఆకలిగొన్నవేళ తల్లి స్తన్యామృతముకై రోదించు బిడ్డది ప్రార్ధన. వెతలు ఆలకించిన తండ్రికి బిడ్డ తెలిపే హృదయపూర్వక కృతజ్ఞత–ప్రార్ధన. తెలియక చేసిన తప్పులు తెలిసిన వేళ వేదనతో కూడిన పశ్చాత్తాపం–ప్రార్ధన. బూడిదిచ్చే వాడినేది అడిగేదన్న నిందాస్తుతి – ప్రార్ధన. "సద్గురు బాబా సాయి–తుజవాచుని ఆశ్రయనాహీభూతలి", ప్రభూ! ఈ ప్రపంచంలో నీవు తప్ప నాకు ఆశ్రయమిచ్చే వారెవరన్న ఉత్కృష్టమైన శరణు – ప్రార్ధన."సహవీర్యం కరవావహై। తేజస్వినావధీతమస్తు మావిద్విషావహై" గురుశిష్యులిరువురూ శక్తివంతులయి, ఇరువురూ తేజోవంతులవ్వాలన్న ఉన్నతోన్నత ఆశయం – ప్రార్ధన. "సర్వేజనా సుఃఖినోభవంతు" అంటూ సర్వజన శాంతి, సౌభాగ్యాల విన్నపం – ప్రార్ధన.

ప్రార్ధన అంటే కోరికల చిట్టా కాదు. డిమాండ్ నోటీసు లేక మొక్కుబడుల ఆధ్యాత్మిక వ్యాపారం అంతకంటే కాదు. ప్రార్ధనంటే మనిషి అంతరంగ ఆవిష్కరణ. అసూయ, ద్వేషాలకు ఆలవాలమైన అంతరంగానికి చేయవలసిన అభ్యంగన స్నానం. మనసు దొంతరలలో పేరుకొని పోయిన మాలిన్యాన్ని వదిలించే 'శుద్ధి కార్యం' ప్రార్ధన. సర్వోత్తముడైన సద్గురుదేవునితో జరిపే అతి పవిత్ర సంభాషణ ప్రార్ధన. అది కొన్నిసార్లు గురుశిష్యులు చర్చించుకుంటున్నట్లు ఉంటుంది. సర్వమూ తానైన సఖితోప్రియుని



సంభాషణలా తోస్తుంది మరోసారి. తల్లీ,కొడుకులు మాట్లాడుకుంటున్నట్లుంది ఇంకోసారి. 'అడ్డుగోడ' తొలగిన కొద్దీ, 'అసలు' విషయం తెలిసిన కొద్దీ ప్రార్ధన పరమార్ధం అవగతమవుతుంది. హృదయ కమలం సద్గురు నివాసానికై తహతహలాడుతుంది. మాటల మూటలు బీటలు వారి, మౌనం ఆశ్రయమవుతుంది. దైవం దగ్గరవుతుంది. వాక్కు దూరమవుతుంది. ఆయన ఆజ్ఞ లేక ఆకైనా కదలదన్నది అక్షర సత్యమై – కనులముందు సాక్షాత్కరిస్తుంటే మనలను కేవలం సాక్షీభూతులను చేస్తుంది – అదే ప్రార్ధనలోని ఔన్నత్యం.

**'ప్రార్ధనా'నుభవం – జీవన సౌరభం :** అజ్ఞానికి జ్ఞానాన్ని, పిరికివాడికి ధైర్యాన్ని, భయస్తునికి అభయాన్ని, బాధలో ఉన్నవాడికి ఊరడింపును, అశక్తునికి శక్తిని, అవివేకికి వివేకాన్ని, పతనావస్థలో ఉన్న మనిషికి ప్రగతిని అందించే ఉపకరణం ప్రార్ధన. ప్రార్ధన చేసి సద్గురు నిర్ణయాన్ని మార్చమని వేడుకుందాం అనుకుంటాం అననుకూల పరిస్థితుల్లో! నిజానికి మారవలసింది మన మానసిక స్థితి. స్తుతి (ప్రార్ధన) చేస్తే మారేది మన స్థితి – మనఃస్థితి.

ప్రార్ధనలో సానుకూల దృక్పథాలు ప్రాణం పోసుకుంటాయి. అవి జీవితం మీద కొత్త ఆశలు రేకెత్తించి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదిస్తాయి. ప్రార్ధన మన జీవన విధానంలో మార్పు తెస్తుంది అంటారు ఆచార్య భరద్వాజ. ప్రార్ధనకంత ప్రభావం ఉంటుందా అన్న సందేహం మనకు రావచ్చు. వైద్య శాస్త్రంలో 'ప్లాసిబో ఎఫెక్ట్' అన్న ఒక అంగమున్నది. మందు వాడితేనే వ్యాధి తగ్గుతున్న భావన ఉన్నవానికి గుణరహిత పదార్ధాన్ని ఇచ్చి వ్యాధిని తగ్గిస్తారు (ఏమారుస్తారు). గుణరహిత పదార్ధానికే అట్టి శక్తి ఉంటే సర్వశక్తిమంతుడైన సృష్టికర్త, సద్గురువు మన మాటలు ఆలకించాడన్న విశ్వాసం మనలను ఎంత ఉత్తేజితుణ్ణి చేస్తుందో ఆలోచించండి. మరింతగా మనసుకు చేరేందుకు ఒక చిన్న కథను చూద్దాం.

పెద్దగా లోకజ్ఞానం లేని శీనయ్య (ఓ సామాన్యుడు) ప్రార్ధనాశ్లోకాల పుస్తకాన్ని సంచిలో పెట్టుకొని సంతకు బయలుదేరాడు. తిరిగి రావడానికి ఎటూ ఆలస్యమవుతుంది కనుక. ఆ దారిలో ప్రార్ధన చేసుకోవచ్చు అన్న ఆలోచన, రద్దీలో పుస్తకం పోయింది. గమనించుకొని శీనయ్య తిరుగు ప్రయాణంలో సత్రం దగ్గర ఆగి కాళ్లు, చేతులు కడుక్కొని ప్రార్ధనకై పుస్తకం కోసం వెదికాడు. ఎంతకూ కనపడలేదు పుస్తకం – స్థిమిత పడలేదు చిత్తం. "దేవా! నన్ను క్షమించు. నీ ప్రార్ధనా శ్లోకాల పుస్తకం ఎక్కడో పడిపోయింది. ఓ పనిచేస్తాను. నాకు తెలుగు అక్షరమాల కంఠతాఃవచ్చు పదిసార్లు శ్రద్ధాభక్తులతో అక్షరమాలెను వల్లెవేస్తాను. ప్రభూ! నాపై దయచూపి, శ్లోకాలకు సంబంధించిన అక్షరాలను నీవు స్వీకరించవలసినది" అంటూ స్తుతించాడు. "నేను ఈ రోజు ఓ అద్భుతమైన ప్రార్ధన విన్నాను. అంత గొప్పగా, హృదయపూర్వకంగా నన్నెవరూ ప్రార్ధించలేదు" అంటూ పరవశించాడు భగవంతుడు. దైవానికి దగ్గర భాష – హృదయనివేదన.



అందుకే “ప్రార్థనంటే అడగడం కాదు, అది హృదయవేదన. మాటలు నిండిన హృదయప్రార్థన కన్నా మౌనం నిండిన హృదయప్రార్థన మిన్న” అంటారు జాతిపిత గాంధీ!

**ప్రార్థనాపథం – మాలిన్య రహిత మానవసౌధం :** ‘నేను భగవంతుని బానిసను, భగవంతుడే సర్వానికి యజమాని”, “అల్లామాలిక్ హై”, “శ్రీసాయి భక్తులకు శ్రీసాయియే సకలదేవతా స్వరూపము, ఉపాసనా దైవము”, “బాబా, బాబా, బాబా అంతే, వేరే ఏదీ ఉండకూడదు, మనసులో” – మనుషులుగా మన మధ్య తిరిగి, “మనిషి దైవంగా మారడమే తమ మతంగా” జీవించిన మహాత్ముల మాటలు మనకు బాటలవ్వాలి. భగవంతుని బానిసనంటూ సాయి, సాయి తప్ప అన్యమేదీ లేదన్న గురుదేవుల మాటల్లోని వినమ్రభావం కేవలం మానసిక పుష్పాన్ని సద్గురుచరణాల చెంత నివేదించడం ద్వారానే సాధ్యం. ప్రార్థన మనకు అట్టి సంస్కార సంపత్తిని అందిస్తుంది. ప్రార్థన గురించి భరద్వాజ మాస్టారు ఇలా అంటారు. సరిగా చేస్తే ప్రార్థన వలన నానాటికీ వినమ్రత కలుగుతుంది. మనమెంత సామాన్యులమో, భగవంతుడు లేక సద్గురువు ఎంత ఉత్తముడో నానాటికీ అవగతమవుతుంది. ఆయన చెప్పినది జవదాటడం నానాటికీ మరీ భయంకరమవుతుంది. అదే ప్రార్థన సరిఅయిన అవగాహనతో చేయకుంటే మనం భక్తులం, సాధకులం, జ్ఞానులం అని, ఇతరులు అల్పులనే అహంకారం ప్రబలుతుంది. అందుకే సాధకుడు ఎప్పుడూ భగవంతుని పట్ల ద్వైతభావాన్ని, దాస్యభావాన్ని వ్యక్తం చేసే ప్రార్థనలే చేయాలి. దీన్నే సాయి మనకు చూపిన మార్గం. “నేను భగవంతుని బానిసను, భగవంతుడే సర్వానికి యజమాని” అని నిరంతరం స్మరించేవారు. ప్రార్థన మన నడవడిని, మన భావాలను సంస్కరిస్తుంది. అందరూ ఆయన రూపాలే అయితే ఎవరిని ద్వేషించగలం? ఎవరిపై పంతం, అసూయ వహించగలం? ఈ భావాలు వ్యర్థాలేగాక, ఎంత అనర్థదాయకాలో తెలిస్తే, మన నడవడిక, ప్రవర్తన, ఆచరణ, మన ఆలోచనా ఇలా ఎందుకుంటాయి? అంటారు శ్రీ భరద్వాజ మాస్టరుగారు. ఇదే గురువుగారు చెప్పేది. సరిగా మనం సత్సంగం చేస్తుంటే మన “ఆలోచన, ప్రవర్తన, ఆచరణాదులలో మార్పు రావాలి” అని.

**ప్రార్థన మానవ స్వభావంలో ఒక భాగం – ప్రార్థన అతి సులభం... ఫలమధికం :** పసితనంలో అమ్మకోసం ఏడుపు ప్రార్థనే – యవ్వనంలో ఉద్యోగం కోసం పరితాపమూ ప్రార్థనే. ఎదుటివారి కష్టాన్ని చూసి వాడికంతా మంచే జరగాలన్న బలమైన ఆకాంక్ష – ప్రార్థనే. మనలో కలిగే భావోద్వేగాల్ని దైవంవైపు మరలించడమే ప్రార్థన. ఇట్టి ప్రార్థనకు పరిమితులు లేవు. రోజుకి ఒక్కసారనో, ఐదుసార్లనో నిబంధన లేదు. కష్టాల్లో ఉన్నప్పుడు మాత్రమే ప్రార్థించాలన్న పరిమితి లేదు. అవసరమైనప్పుడు మాత్రమే తీయడానికి అది డిక్కీలోని అదనపు టైర్ కాదు. అది కార్ స్టీరింగ్‌తో సమానం. పనిలో, విశ్రాంతిలో, నిద్రలో, శ్వాసలో జీవితాన్ని ప్రార్థనగా మలచుకున్న మహానుభావులే (గాంధీజీ, మదర్ థెరిసా) మహాత్ములు. ప్రార్థనా పద్ధతి ఏదైనా సద్గురునితో సంబంధాన్ని కొనసాగిద్దాం అంటారు స్వామి యతీశ్వరానంద. ప్రార్థనను జీవితంలో

భాగం చేసుకుంటే పరిణామంలో కొంత కాలానికి జీవితమే ప్రార్ధన అవుతుంది. దీన్నే "సాధన జీవితంలో భాగం కావడం కాదు – సాధనలో జీవనం భాగం కావాలి" అని అంటారు శ్రీబాబూజీ.



**ప్రార్ధనలో తొలి–మలి :** ప్రార్ధనంటే పదాడంబరం కాదు. మహాత్ముల దివ్యాంతరంగమును ఎరిగి, మన మనసు కరిగి, హృదయము నుండి వెలువడే భావముల విన్నపము సద్గురువును తెలుసుకునే సానుకూల దృక్పథాల సమాహారం – సత్సాంగత్యం. సద్గ్రంథం, సంగీతం (భజన, నామస్మరణ). నియమపాలనకున్న ప్రాధాన్యాన్ని సద్గురుదేవుల మాటల్లో గుర్తెరిగిన మనం ప్రార్ధనకు కేటాయించిన సమయాన్ని ప్రార్ధనకే వినియోగించుకుందాం. అంతలోపు మిగిలిన సమయంలో మన పనులన్నీ పూర్తి చేసుకుందాం. 'క్రమ'శిక్షణ కొరవడితే ఇది సాధ్యం కాదు. తొలిగా బద్ధకం, నిరాసక్తత మనలను దారి మళ్లిస్తాయి.లొంగితే లోతుల్లో పడతాము. మాట వినని విద్యార్థిని ఉపాధ్యాయుడు బెత్తంతో బెదిరించినట్లు పరుగెత్తే మనసుకు పగ్గం వేయాలి. కేవలం విమానం ఎక్కడానికి వెళితేనే ఎన్నో తనిఖీలు, నిబంధనలు – ఈ దేశంలో అయినా, పరాయి దేశంలో అయినా. కానీ సత్సంగం, పూజ, నియమం, ప్రార్ధన ఇలా దేని దగ్గర మనల్ని మనం తరచి చూసుకోము. బుర్ర నిండా చెత్తను నింపి – అవసరమైన విషయాలను, అనవసరమైన వాటిని నింపి, నింపి సద్గురువు ముందు కూర్చుంటే సద్గురు సత్యరూపం బదులు మనలోని కుత్సిత ఆలోచనల విశ్వరూపం దర్శనమవుతుంది.

మనలో(న) ఉన్న ఆ కడజాతి వాడిని గుర్తెరిగి సద్గురు చరణాల చెంత తెరచిన పుస్తకంలా తయారవుదాం. ఆపాదమస్తకమును ఆ అనుగ్రహ చక్రవర్తి అనుపానాలలో ఈ జగత్తంతా సాగుతున్నదన్న స్ఫురణలో నిలుద్దాం. అడగడం నేర్పుటే సాయిపథమన్న సత్యాన్ని మరువకుండా మన అడుగులు గమనించుకుందాం. అడగడం ఎలాగో ఒక చిన్న కథ – ఒక కొండమీద మూడు చెట్లు ఉన్నాయి. మొదటి చెట్టు, "ప్రభూ! నేను ఈ ప్రపంచం చుట్టి రావాలి" అని వేడుకుంది. రెండవచెట్టు, "స్వామీ! నాకు చక్కటి వజ్ర, వైఢూర్యాలు కావాలి" అంది. మూడవచెట్టు, "దేవా! నేను సదా నీతో, నీవు నాతో(డు) ఉండాలి" అంది. మొదటి చెట్టు ఓడ తయారీదారుడు తీసుకువెళ్లాడు. దేశాలు చుట్టింది ఓడ. సముద్ర తుఫాను ఎదురయిననాడు తెలియలేదు దాని జాడ. రెండవచెట్టు వడ్రంగి తీసుకువెళ్లి రాజుకు చేసిపెట్టాడు నగలపెట్టె. దొంగలపాలైన నగలపెట్టె ఒకనాడు చేరింది ముక్కలై చెత్త గుట్ట. మూడవ చెట్టును ఒక కళాకారుడు మలిచాడు మందిరంగా – మనోహరంగా. సద్గురుచరణాలు సదా తనపై, చెట్టు స్మరణాదులు సదా గురువుపై! నిత్య సత్సంగం, సద్గురువే సత్యమనే సాహిత్యం! గంధం సద్గురువుకు, సుగంధం చెట్టుకు! గురుబంధువుల సద్గురు స్మరణ – చెట్టుకు అందింది సద్గురు కరుణ.



అడగడం నేర్చుకోవడంలో ఒక్క అడుగు వేద్దాం. ఏది అడిగితే ఇంకేది అడగవలసిన అవసరం లేదో దాన్ని అడుగుదాం. 'అడగటం నేర్పుటే సాయిపథం' అన్న భజనామృతం సతతం మననంలో, మనలో నిలుపుకున్న స్ఫురణలో 'సాయి' అన్న పదం విలువెరిగి, 'సాయిపథం'లో పయనిద్దాం. అప్పుడే అడగడం చేతనవుతుంది. అడిగింది ఇచ్చే సాయిశపథాన్ని మననం చేసుకుందాం. "అడిగినవారికి అడిగినంత సమృద్ధిగా ఇవ్వమని నా యజమాని నన్ను ఆదేశించాడు. కానీ నా మాటలు చెవినబెట్టేదెవరు? నా ధనాగారపు తలుపులు బార్లా తెరచిపెట్టి ఉంచాను. కానీ ఆ సంపదను తీసుకొని పోయేవారే లేరు! ప్రజలు ఊరకే నా వద్దకొచ్చి 'ఇవ్వు, ఇవ్వు' అంటారు. నేను 'తీసుకో' మంటాను కానీ తీసుకునేవారేరి? మనో మాలిన్యాన్ని 'ప్రార్ధన'తో పరిశుద్ధం చేసుకొని – 'రియల్' హ్యూమన్ బీయింగ్స్‌గా మనల్ని మనం సమర్పించుకున్న నాడు సర్వజీవ స్వరూపుడైన సాయి – మనకు దర్శనమిస్తాడు. 'మనిషి దైవంగా ఎదగడం బాబా మతమన్న సద్గురు వాక్యం మనందరి జీవితాల్లో సత్యంగా భాసిస్తుంది. నిత్య 'ప్రార్ధన' మనలో అనిత్య వస్తువుల పట్ల ఆసక్తిని తగ్గించి – సత్యమైన సద్గురు చరణాలను చేరుస్తుంది.

## శరచ్చంద్రికలు

### ఆర్తి – *జూలై 2013*



**భక్తుడు :** గురువుగారూ, సద్గురువు పట్ల మనకు ఉన్న ఆర్తిని ప్రార్ధన రూపంలో వ్యక్తీకరించవచ్చా?

**గురువుగారు :** మనలో కలిగేటటువంటి ఆ తపనే ప్రార్ధన. కేవలం మాటలతో సాంప్రదాయానుసారం చేసేది మాత్రమే ప్రార్ధన కాదు. నువ్వు దాహంతో ఉంటే, నీలో కలిగే ఆ 'దాహం' అనే అనుభవమే మంచినీటికోసం నువ్వు చేసే 'ప్రార్ధన'. నువ్వు (నీళ్లకోసం) ప్రార్ధిస్తున్నావు. మీకు బాబా పట్ల ప్రేమ, బాబా కోసం మీకుండే తపన... అదే ప్రార్ధన! ఆ తపన ఎడతెగని, నిరంతర ప్రార్ధన. ఆ ఆర్తి, తపన ఏమిటి? అది అంతరాంతరాళాలలో, నేను బాబాకు చెందినవాడిని, బాబా నావాడు – అనే భావనను కలిగి వుండి, ఆ అనుబంధ భావనను అనుభూతి చెందడం. ఆ అనుబంధాన్ని మీకు స్పష్టంగా, అనుభవంగా అందించడానికి ఈ ఆర్తి ఉపయోగపడుతుంది. మీకు అటువంటి తీవ్రమైన తపన ఉన్నంతవరకు అదే ప్రార్ధన, అదే ధ్యానం, అదే ఆధ్యాత్మిక అన్వేషణ, అదే సాధన. అర్ధమవుతోందా? నేను చెప్పేది అర్ధం చేసుకోగలుగుతున్నారా?

**భక్తుడు :** మనకు అటువంటి తపన ఉండి, మనం ఆయనకు సంబంధించిన వాళ్ళం అని తెలుసుకుంటే ఆ ఎరుకే మనకు ఆనందాన్ని ఇస్తుంది – మీరంటున్నది ఇదేనా?



**గురువుగారు :** “నేను బాబాకు సంబంధించిన వాడిని, బాబా నాకు సంబంధించినవారు” అనే అనుభవం ఆనందాన్నిస్తుంది.

**భక్తుడు** : అందరిలోనూ ఆ తపన ఏదో కొంతైనా ఉంటుంది కదా?

**గురువుగారు :** అవును, ఆ తపన ప్రతి ఒక్కరికీ ఉంటుంది. ఆ తపనే మనకు ఆయనతో గల సంబంధాన్ని తెలియచేస్తుంది. ఆయన కోసం తపిస్తూ ఉండటమే మనం ఆయనకు చెందినవారమనే దానికి గుర్తు, ఆయనకు చెందడం అంటే అటువంటి తపనను కలిగి ఉండటమే, మీరందరూ నాకు సంబంధించిన వాళ్లని మీరు అనుకుంటున్నారు కాబట్టి సత్సంగం కోసం ఎదురుచూస్తూ ఉంటారు. అంతే కదా? (గురువుగారు నవ్వుతూ..)

**భక్తుడు** : (అందరూ ఒకేసారి) అవును గురువుగారూ! (నవ్వులు..)

**గురువుగారు :** ‘నేను బాబాకు చెందినవాడిని, బాబా నావారు’అనేటువంటి సంబంధం యొక్క ఎరుకను గుర్తుపెట్టుకోవడం (అనుభవాన్ని కలిగివుండటం) చాలా ముఖ్యం. ఇది చెయ్యగలిగితే చాలు. మీరు దీనిని గుర్తు పెట్టుకున్నంత వరకు అదే నిజమైన స్మరణ, నిజంగా జ్ఞప్తిలో ఉంచుకోవడం.

**భక్తుడు** : బాబాతో మనకు గల సంబంధం బేషరతుగా ఉంటుందా?

**గురువుగారు :** ఆ సంబంధానికి షరతులున్నా, లేకపోయినా నువ్వు దానిని గుర్తుంచుకుంటే చాలు. అసలు బేషరుతుగా అంటే ఏమిటో నాకర్థం కాలేదు.

**భక్తుడు** : నా ఉద్దేశ్యం ఏమిటంటే, చాలా సందర్భాలలో నాకేదైనా కోరిక కలిగినపుడు నేను బాబాను అడుగుతాను, ఆయన ఇస్తారు. ఆ క్షణంలో నాకు ‘నేను ఆయనకు చెందినవాడిని’ అనే అనుభూతి కలుగుతుంది. అదీ కొద్ది సమయం మాత్రమే నిలిచివుంటుంది.

**గురువుగారు :** నువ్వు ఆయనకు సంబంధించినవాడివి అనే భావన నీకుంటే, ఆయన నువ్వడిగింది ఇవ్వకపోయినా అదెక్కడికీ పోదు. ఉదాహరణకు, నీకో పాప ఉంది. ఆ అమ్మాయి ఫస్ట్‌క్లాస్‌లో పాస్ కావాలని నువ్వు చాలా ఆశిస్తావు. ఒకవేళ పాస్ కాలేదనుకో, నువ్వు ఆమెను ప్రేమించడం ఆపేస్తావా? పాస్ కాకపోయినప్పటికీ నువ్వు ఆ అమ్మాయిని ఎందుకు ప్రేమిస్తావు? ఆమె నీకు సంబంధించినది కాబట్టి!! ఇలాగే, బాబా నీ కోరిక తీర్చినా తీర్చకపోయినా నీకు గనుక నువ్వు ఆయనకు చెందినవాడివి అనే అనుభవం ఉంటే అంతా జరిగిపోతుంది, మొత్తం వ్యవహారం జరిగిపోతుంది. నువ్వు దేనికోసమూ అన్వేషించనక్కరలేదు, నువ్వేదీ నేర్చుకోవలసిన అవసరం లేదు. ఆ అనుభవం చాలు. మనందరం ఇక్కడ ప్రయత్నించేది మనకు బాబాతో గల ఆ సంబంధాన్ని అనుభవంలోనికి తెచ్చుకోవడానికే.

మీరు భగవాన్ జీవితచరిత్ర చదివితే తెలుస్తుంది. భగవాన్ విషయంలో కూడా – అసలు ఆయన అన్వేషణ మొత్తం మొదలైంది ఆ సంబంధ భావనతోనే! ఆయన అన్వేషణ, వెతుకులాటకు మూలం ‘తామెవరు’ అనే గుర్తింపును తెలుసుకోవడం కోసమే. రమణులు తాము ఇంటినుండి బయలుదేరేటప్పుడు ఇంట్లో



వాళ్లకు ఒక ఉత్తరాన్ని వ్రాసిపెట్టారు, "నేను నా తండ్రిని వెతుకుతూ, నా తండ్రి ఆజ్ఞానుసారం ఇక్కడి నుండి వెళ్లిపోతున్నాను..." ఆయన అన్వేషణ ఆయన తండ్రి కోసం! "నేను ఆయనకు చెందినవాడిని" అని భగవాన్ అనుకున్నారు, అందుకే అరుణాచలం వెళ్లిపోయారు. ఆయన వ్రాసిపెట్టిన ఉత్తరాన్ని ఈ కోణంలో చదవండి, నేను చెప్పేదేమిటో మీకు అర్థమవుతుంది. చూడటానికి చాలా సాధారణమైన విషయంలాగా కనిపించినప్పటికి అది అంత సాధారణమైన విషయం కాదు. "నేను అరుణాచలానికి చెందినవాడిని, ఆయన నా తండ్రి, నేను ఆయన వాడిని" అనేటటువంటి బాంధవ్య భావనది. ఆ చిన్న వయస్సులో ఆయనకు అదేమిటో, ఎవరో తెలియదు, ఆయన దానిని 'అరుణాచలమని' అనుకున్నారు. ఇక్కడికి వచ్చి అరుణగిరిని దర్శించారు. ఒక స్థాయిలో ఆయనకు సంతృప్తి కలిగింది, అది అంత మాత్రమే కాదు, మరేదో కూడా ఉంది. అప్పుడు ఆయన దానిని అనుభవం పొందడం ప్రారంభించారు. "ఆయన నా తండ్రి, నేను ఆయన బిడ్డను" – ఈ గుర్తింపు – 'తామెవరు' అనే అన్వేషణకు సమాధానమైంది. ఈ ప్రశ్ననే ఆయన తమదైన పద్ధతిలో "నేనెవరు?" అని వ్యక్తం చేసారు. ఇంకోరకంగా "ప్రశ్నించేవాడెవరు?" అని మనం అడగవచ్చు.

**భక్తుడు** : "నా తండ్రి ఎవరు" అని విచారించాలని మీ ఉద్దేశ్యమా?

**గురువుగారు :** కాదు, నేను "నేనెవరు?" అనే విచారణ గురించి చెబుతున్నాను. "నేనెవరు?" అనే విచారణ వ్యక్తి అస్తిత్వానికి సంబంధించినది. కొందరు దానిని "నేను ఆత్మను, నేను బ్రహ్మాన్ని, నేను ఈశ్వరుణ్ణి" అని అనుభూతి చెందుతారు. మరి కొందరు దానిని రమణమహర్షి వలె అనుభూతి చెందవచ్చు. రమణుల "గుర్తింపు" ఏమిటి? తాము "అరుణాచలేశ్వరుని కుమారుడు" అని.

అలా మీరూ "నేను సాయిబాబా కుమారుణ్ణి, నేను ఆయన వాడిని, ఆయన నాకు చెందినవారు" అని అనుభూతి చెందవచ్చు. ఆయన నీ వాడు కాబట్టి నువ్వు ఆయనను నీ స్వాధీనం చేసుకోవాలనుకుంటావు, ఆయనను పొందాలనుకుంటావు. ఆయనపట్ల నీ వ్యక్తీకరణలన్నీ ఆయన 'నీ స్వంతం' అనే భావానికి వ్యక్తీకరణలవుతాయి. చూడటానికి 'నాకు' మాత్రమే స్వంతం' అనే భావన సరైన ధోరణిగా కనిపించనప్పటికీ ఇది అటువంటిది కాదు. నువ్వు ఆయనను స్వాధీనం చేసుకోవాలనుకుంటావు, ఆయన ప్రేమను, ఆయన స్వభావాన్ని, ఆయన ఆనందాన్ని పొందాలనుకుంటావు.

మళ్ళీ రమణమహర్షి విషయమే తీసుకుంటే, ఆయన దానిని మరోరకంగా చెప్పారు, "ఆ అనుభవం వచ్చిన తరువాత, నన్ను ఒక రకమైన ఆవేశం ఆవహించింది" అన్నారు. భగవాన్ 'ఆవేశం' అనే సంస్కృత పదాన్ని వాడారు, ఏదో మరో ఆత్మ ఆయనను పూనినట్లుగా అన్నమాట. దానిని ఆయన ఏదో జరగరానిది జరిగినట్టుగా కాక చాలా అద్భుతమైన విషయంలా చెప్పారు. ఒక మహోన్నతమైన అస్తిత్వానికి ఆయన స్వాధీనమయ్యారు. మనకన్నా ఉన్నతమైన గుర్తింపు మనల్ని ఆవహించినపుడు అది మనలో పరివర్తన



కలిగిస్తుంది. ఎందుకంటే మనలో భావోద్వేగాలు, ఆలోచనలన్నీ మన గుర్తింపు, 'నేనెవరు' అనే కీలకమైన అంశం మీదనే ఆధారపడి ఉంటాయి. ఒక్కసారి మన గుర్తింపు మారడం, పరివర్తన చెందడం మొదలు పెట్టిన తరువాత దానిమీద ఆధారపడి వున్న మన అనుభవాలు, మన జీవితం మొత్తం పరివర్తన చెందడం ప్రారంభమవుతుంది. **'నేను ఫలానా' అనే గుర్తింపే మనం మారడానికి మూలం.** అందుకే భగవాన్ "నేనెవరు? అనే విచారణ ద్వారా ముందు నువ్వెవరో తెలుసుకో" అన్నారు. ముందు మీ అస్తిత్వం ఏమిటో తెలుసుకోండి. మిమ్మల్ని మీరు ఫలానా అని అనుకోవద్దు. మీ అస్తిత్వాన్ని తెలుసుకోండి, ఈ రెండింటికీ తేడా ఉంది. అది ఏదైనా కానీ, మనం మనదీ అనుకుంటున్న ఈ ప్రస్తుతమైన అస్తిత్వాన్ని కోల్పోతే తప్ప మన నిజమైన అస్తిత్వాన్ని తెలుసుకోలేము. భగవాన్ అదేమిటో చెప్పలేదు, ఆయన అనుభవం దానికి ఒక సమాధానం, అది ఆయన స్వంతం. మరికొందరి అనుభవాలు మరోరకంగా ఉండి ఉండవచ్చు. మన నిజమైన అస్తిత్వాన్ని మనం తెలుసుకుంటే అది మనకు చాలు.

**భక్తుడు** : ప్రేమ, ఆర్తి అహాన్ని అధిగమించగలవా?

**గురువుగారు :** అవును, ప్రేమ ఎప్పుడూ అహాన్ని అధిగమిస్తుంది.

**భక్తుడు** : అంతటి తపన ఉన్నప్పుడు అందులో ప్రేమించేవాడు, ప్రేమించబడేవాడు అనే ద్వైతభావం ఉన్నట్టే కదా?

**గురువుగారు :** అటువంటి ద్వైతభావాన్ని దాటిపోవడానికి కావలసిన ప్రోద్బలాన్నిచ్చేది ఈ పరితాపం. ఒకరినొకరు ప్రేమించుకునే అబ్బాయి, అమ్మాయి ఉన్నారనుకుందాం. వారిరువురూ ఒకరిని మరొకరు సొంతం చేసుకోవాలి అనుకుంటారు. అబ్బాయి ఇక్కడ, అమ్మాయి అక్కడ. వారి మధ్య ఎడబాటు వలన పరితాపం ఉంది – నిజానికి అక్కడ ద్వైతభావం ఉంది. కానీ వారిద్దరూ ఒకచోటకు చేరుకున్నపుడు, ఆ కలయికలో, "నేనే నువ్వు, నువ్వే నేను, మనిమిద్దరం వేరు వేరు కాదు, మనం ఒక్కటే" అంటారు. ఆ క్షణంలో అక్కడ అమ్మాయి విడిగా లేదు, అబ్బాయి విడిగా లేడు – అది ఇద్దరూ కాని మరేదో అవుతుంది.

**భక్తుడు** : ఆ స్థితిలో కూడ పరితాపం ఉంటుందా?

**గురువుగారు :** ఆనందానుభవం ఉంటుంది. ఆ క్షణంలో ఆనందమే. కానీ ఆ ఆనందానుభవం తరువాత తిరిగి ఆ పరితాపం కలగవచ్చు. ఎందుకంటే ఆ పరితాపం ఇద్దరూ విడివిడిగా ఉన్నామన్న భావన (ద్వైతభావం) మీద ఆధారపడి ఉంటుంది. కాబట్టి తత్ఫలితమైన ఆనందానుభూతి చాలా తక్కువ సమయం మాత్రమే ఉంటుంది. ఇద్దరూ విడివిడిగా ఉన్నామన్న భావన (ద్వైతభావం) లేకపోతే ఒక్కటి కావాలనే తపన ఉండదు. అందుకనే ఆనందానుభవం పొందిన తరువాత కూడా ద్వైతభావం ఉన్నంతవరకూ దానిని దాటిపోయి ఏకత్వాన్ని పొందాలన్న తపన కలుగుతూనే ఉంటుంది. రమణమహర్షి చెప్పినట్లు, "ముల్లును (ద్వైతభావాన్ని) ముల్లుతోనే (ద్వైతభావంతోనే) తీయడం లాంటిది". ఎవరితో ఏకత్వము తమకు ఆనందానుభూతిని కలిగించిందో ఆ అరుణాచలాన్ని దర్శించి, ఆ సన్నిధిని అనుభవించాలని భగవాన్

పరితపించారు. అందుకనే "అరుణాచల అష్టకం" చివరి పంక్తిలో భగవాన్, అక్కడ 'ఇద్దరు' లేరు అంటారు. ఆయన పరితాపం ఆయనకు ఏకత్వానుభూతిని కలిగించింది.



**భక్తుడు :** ప్రతి ఒక్కరి ఆనందాన్వేషణ, చాలా వరకు వారు 'తామెవరో' అనే గుర్తింపును తెలుసుకోవడానికి చేసే అన్వేషణే అని మీరనుకుంటున్నారా?

**గురువుగారు :** అవును, అందరికీ ఇవి రెండూ ఒకటే. కానీ చాలా మందికి దానిపట్ల అలాంటి ఎరుక ఉండదు. వాళ్ళ సమస్యలు బాగా ప్రాపంచికమైనవి కావడం చేత 'తామెవరు' అనే గుర్తింపుకు సంబంధించిన ప్రశ్న వాళ్ళలో మరో రూపంలో తలెత్తవచ్చు. ఉదాహరణకు, వాళ్ళకు ఒక కోరిక ఉంది, వాళ్ళు దానిని తీర్చుకోవడం కోసం బాబాను అడుగుతారు. బాబా ఆ కోరికను ఎందుకు తీర్చాలి? దానికోసం వాళ్ళు, "నేను ఆయన భక్తుణ్ణి. మాకు కర్మ సంబంధం ఉంది, నాకు బాబాతో ఋణానుబంధం ఉంది" అనేటటువంటి గుర్తింపును, సంబంధాన్ని ఏర్పరుచుకోవాలనుకుంటారు. ఇది "నేనెవరు?" అనే ప్రశ్నకు, "నేను ఆయనకు చెందినవాడిని" అనే సమాధానంలాగా ఉంటుంది. కాబట్టి ఆయనకు చెందినవారము అనే భావన ఒక సంబంధాన్ని ఏర్పరచి వారి కోరికలు తీర్చుకోవడానికి ఒక మార్గాంతరమవుతుంది. ఇక్కడ కూడా వారు ప్రయత్నించేది ఆ అనుబంధ భావన కోసమే. ఇది కూడా మళ్లీ 'తామెవరు' అన్న గుర్తింపు కోసం సాగే అన్వేషణే. అయితే, ఇది మరోస్థాయిలో మరో మార్గంలో వేరొక పరిధి, తీవ్రతలతో సాగుతుంది. ఇక్కడ కూడా అది అలాంటిదే, మనం బాబా చరిత్ర చదువుతాము, "సాయిబాబా, సాయిబాబా" అంటూ బాబా నామాన్ని పలుకుతాము. ఏమిటి ఇదంతా? ఇవన్నీ మనం ఆయనకు చెందినవారమన్న భావాన్ని, ఆ గుర్తింపును రూఢీపరుచుకోవడమే! "బాబా, నేను నీ నామాన్ని ఇన్నిసార్లు పలుకుతున్నాను, మనం ఒకరికొకరు బాగా తెలుసు, నేను నీతో సన్నిహితంగా ఉంటాను, నేను నీ వాడిని, అందుకని నా గురించి పట్టించుకోండి, నా కోరికలు నెరవేర్చండి" (గురువుగారు నవ్వుతూ) దీని పర్యవసానమూ ఆ సంబంధ భావనే. అందుకని ఇది కూడా అది 'తామెవరు' అనే గుర్తింపు సంబంధించిన అన్వేషణే.

**భక్తుడు :** గురువుగారూ, మేము బాబాను ఆర్తిగా ప్రార్థిస్తే, ఆ ప్రార్థన, ఆ తపన మమ్మల్ని సద్గురు అనుగ్రహక్షేత్రంలో ఉంచుతుందా?

**గురువుగారు :** అవును. కానీ ఆ తపన చాలా అస్పష్టంగా ఉంటుంది. ప్రార్థనకు ఉపయోగించే పదాలు బాగానే ఉంటాయి, వినసొంపుగానే ఉంటాయి, కవితాత్మకంగా చెబితే ఇంకా బాగుంటాయి. కానీ వాస్తవికంగా చూస్తే అవి అస్పష్టంగా ఉంటాయి. వాటిని పట్టుకోవడం కష్టం. మనం మన తపనను ఎలాగైనా వ్యక్తం చేయగలగాలి. కాబట్టి సత్సంగంలో ఉండటం, బాబా చరిత్రను అనువదించడం, లేదా బాబా రూపాన్ని చిత్రించడం మొదలైనవి చేస్తాము. ఇటువంటివన్నీ ఆ తపనకు వ్యక్తీకరణలే. మన తపనను నిజంగా వ్యక్తీకరించేదేదో దానిపట్ల మనం జాగ్రత్త వహించాలి. ఊరకనే బాబా రూపాన్ని చిత్రించడమో లేక అనువాదం చెయ్యడం వల్ల ఏమీ ఉపయోగం ఉండదు. మనం చేసే పని నిజంగా మనలోని తపనను,

ప్రేమను వ్యక్తం చేస్తోందా, లేదా అని మనం ఎప్పటికప్పుడు తరచి చూసుకుంటూనే ఉండాలి.



**భక్తుడు :** మమ్మల్ని మేము ప్రశ్నించుకోవడం ద్వారా, మా తపనను ఎలా వ్యక్తం చేయాలి అనే విషయంలో స్పష్టత వచ్చి, సరిగా మా ఆర్తిని వ్యక్తపరిస్తే అప్పుడు మా ఆనందం ఎక్కువవుతుంది. అంతేనా, గురువుగారూ?

**గురువుగారు :** అవును. ఆనందము, తపన పెరుగుతాయి. మనలో ఆ తపన పెరిగేకొద్దీ మనం ఆయనకు ఇంకా ఇంకా దగ్గరవుతాము. నువ్వు ఎంతగా తపిస్తే అంతగా ఆయనకూ నీకూ మధ్య దూరం తగ్గుతుంది. (గురువుగారు నవ్వుతూ...) అదీ దానిలోని సౌందర్యం. ఆ తపన మిమ్మల్ని బాబాకు దగ్గర చేసి, విడివిడిగా ఉన్నామన్న భావనను తగ్గిస్తుంది.

**భక్తుడు :** కానీ ఈ తపన మధురంగానూ ఉంటుంది, కష్టంగానూ ఉంటుంది కదా?

**గురువుగారు :** అవును, రెండు విధాలుగానూ ఉంటుంది. మనం అనుభవించే ఎడబాటు వలన అది కష్టంగా ఉంటుంది. కానీ ఈ తపనలో అంతర్లీనంగా మనం ఆయనకు చెందినవారమనే భావోద్వేగం కూడా ఉంటుంది. మనలో, మనం ఆయనకు చెందినవారమనే భావన ఉన్నంతవరకు ఆ తపన ఉద్విగ్నభరితంగా, మనోహరంగా ఉంటుంది. మనం ఆయనకు చెందినవారమనే అనుభూతితో ఆయన కోసం తపించడం అద్భుతంగా ఉంటుంది!

## విద్యాసక్తి - *ఆగష్టు 2013*



శ్రీబాబూజీ ఒక గృహస్థుగా వారి జీవనోపాధికోసం 1983వ సంవత్సరంలో ఒంగోలు పట్టణంలో సాయిబాబా సెంట్రల్ స్కూల్‌ను స్థాపించారు. ప్రకాశం జిల్లాలో అత్యుత్తమమైన స్కూలుగా సాయిబాబా సెంట్రల్ స్కూల్ పేరెన్నికగన్నది. పిల్లల విద్య విషయంలో శ్రీబాబూజీ అమలులో పెట్టిన నవీన దృక్పథాన్ని అలాగే కొనసాగించడానికి స్కూలు యాజమాన్యం, సిబ్బంది నిరంతరమూ కృషి చేస్తున్నారు. శ్రీబాబూజీ స్కూలు కోసం రూపొందించిన "(జీవితంలో) నేర్చుకోవడాన్ని ప్రేమించడం, (జీవితాన్ని) ప్రేమించడాన్ని నేర్చుకోవడం" అనే ఆదర్శం విద్య పట్ల శ్రీబాబూజీ దృక్పథాన్ని తెలియచేస్తుంది.

**భక్తుడు :** గురువుగారూ! పిల్లల చదువుకు సంబంధించి నాదొక ప్రశ్న : పిల్లలకు ఇంటి దగ్గర, స్కూలులోనూ ఎటువంటి విలువలు నేర్పాలి?

**గురువుగారు :** ఒకరి విలువలను పిల్లల మీద రుద్దడం విద్య యొక్క ఉద్దేశ్యం కాకూడదు. ఈ ప్రపంచంలో ఎలా నడుచుకోవాలో అనే విషయాన్ని వారికై వారే నేర్చుకునేలా వారిని తీర్చిదిద్దడం, వారికి ఆ సామర్థ్యాన్ని



కలిగించడం విద్య యొక్క ప్రయోజనం. ఉదాహరణకు – ఎలా చదవాలి, ఎలా వ్రాయాలి, ఎలా నేర్చుకోవాలి, ఏదైనా సబ్జెక్టు గురించి మరింత లోతుగా తెలుసుకోవాలంటే వెబ్‌లో ఎలా చూడాలి... ఇలాంటి వాటిని పిల్లలకు నేర్పించాలి.

పిల్లలను ఆలోచింపచేసేలా వారి మెదడుకు విజ్ఞాన విషయాల మేతను అందించడం నాకు ఇష్టం. బాబా గురించి కానివ్వండి, నాస్తికత గురించి కానివ్వండి, హేతువాదమైనా, కమ్యూనిజమైనా, అదేదైనా సరే వాటిని పిల్లల మనస్సుల్లోనికి ఎక్కించడంగాని, వాటిని వారిమీద రుద్దడం కాని చెయ్యవద్దు. ప్రతి విషయాన్ని వారికై వారే కనుక్కొనేలా, తెలుసుకొనేలా చేయండి. వివిధ రకాలైన విశ్వాసాలను వారి మనస్సుల్లోనికి ఎక్కించాల్సిన అవసరం లేదు. పిల్లలకు మతపరమైన విద్యను అందించడాన్ని వ్యక్తిగతంగా నేను వ్యతిరేకిస్తాను. నేను స్కూలు నడుపుతున్నపుడు నేను ఆ ప్రకారంగా మతపరమైన విద్యను నేర్పలేదు. నేను స్కూలు కోసం వ్రాసిన ప్రార్ధనలో కనీసం బాబా పేరు కూడా లేదు. ఆ ప్రార్ధనలో అన్వేషణా స్ఫూర్తిని, ప్రేమను మేల్కొలిపే ఒక విశ్వవ్యాపకమైన నియమాన్ని, మానవాతీతమైన ఆదర్శాన్ని వారు ప్రార్ధిస్తారు. అది భగవంతుడు కూడా కాదు – అన్నింటికీ అతీతమైన ఆదర్శం. అలా చెయ్యడాన్ని నేను ఇష్టపడతాను.

పిల్లలకు నేర్చుకోవడాన్ని, ప్రేమించే గుణాన్ని అలవాటు చేయండి, ఆలోచించే సామర్ధ్యాన్ని ఇవ్వండి. వారి ఆలోచనలకు పరిధులు నిర్దేశించవద్దు. భగవంతుడు అంటే ఎవరో మీరు వారికి చెప్పవద్దు. నేను చదువుకునేటప్పుడు సాయిబాబా భగవంతుడు అని నాకెవ్వరూ చెప్పలేదు. తరువాత నేను సాయిబాబా భక్తుణ్ణి అయ్యాను. వారు పూజించే దైవాన్ని వారి వ్యక్తిగతమైన ఎంపిక కానివ్వండి. పిల్లలకు నేర్చుకోవడానికి, వారి విలువలను వారు ఏర్పరచుకొని ఆచరించడానికి అవసరమైన స్వేచ్ఛావాతావరణాన్ని కల్పించాలి. బాబా కూడా ఇదే బోధించారని నేను అనుకుంటున్నాను.

**భక్తుడు** : గురువుగారూ! మా పిల్లలు నేర్చుకోవడానికి అనువుగా ఉండే స్వేచ్ఛావాతావరణాన్ని ఏర్పాటు చేయడం ఎలా?

**గురువుగారు :** పిల్లల ఆలోచనాధోరణి స్వేచ్ఛాయుతంగా ఉండాలి. వారి యోచన స్వతంత్ర్యంగా ఉండాలి. భగవంతుడు ఉన్నాడని, లేదని ఇలా రకరకాలైన సిద్ధాంతాలను మనమే పిల్లలకు బోధిస్తే అది వారికి స్వేచ్ఛనిచ్చినట్లు ఎలా అవుతుంది? మనం చిన్నపిల్లల మనస్సులపై అటువంటి భావాలను రుద్దితే అది వారి స్వతంత్ర్య ఆలోచన ఎలా అవుతుంది? నేనైతే అటువంటి సిద్ధాంతాల గురించి వారికి చెప్పను. వారికి తెలుసుకోవాలన్న కోరిక ఉంటే ఆ కోరికను అనుసరించి వాళ్లు ముందుకెళతారు. నా దృష్టిలో అదీ స్వేచ్ఛగా యోచించడమంటే!

**భక్తుడు** : నిజమైన విద్యను అందించడమంటే పిల్లలను ప్రశ్నించడానికి ప్రోత్సహించడమే అంటారా?



**గురువుగారు :** అవును. ఆ విద్య స్వేచ్ఛగా, పరిపూర్ణమైన వికాసం కలిగించేలా ఉండాలి. అది సదరు వ్యక్తి మీద ఆధారపడి ఉండాలి. ప్రతి పిల్లవాడికే కాదు, పెద్దవాళ్ళకూ, ప్రతి మనిషికీ ఆ అవకాశం, ఎంపిక ఉండాలి. ప్రతి విషయాన్ని ప్రశ్నించడమే సరైన ధోరణి. పిల్లలను ప్రతి విషయాన్నీ ప్రశ్నించనివ్వండి.

**గురువుగారు :** సంకుచిత భావాలను, దురభిమానాన్ని బోధించడం చాలా తేలిక. విశాలభావాలను, పక్షపాతరహితమైన ధోరణిని నేర్పించడం చాలా కష్టం. మన మనస్సులలోకి చెడ్డభావాలు, పక్షపాతం, విమర్శలు వచ్చి చేరతాయి. ప్రపంచ చరిత్రలో చాలా ఉద్యమాలలో నాయకులు వారి లక్ష్యసాధన కోసం వారు ఆకాంక్షించే అంశాల మీద కేంద్రీకరించకుండా , ప్రజలకు ద్వేషించడానికి ఒక విషయాన్ని అందించే ప్రయత్నం చేయడం నాకు కనిపిస్తుంది. ఒకవేళ ద్వేషించడానికి ఏమీ లేకపోతే నాయకులే ఏదో ఒకదానిని సృష్టిస్తారు. అటువంటి ద్వేషాన్ని ఆధారంగా చేసుకొని, నాయకులు చెప్పే ఆదర్శం పట్ల ప్రజానీకానికి ప్రేమ పెరుగుతుంది. జాతి వివక్షను దీనికి ఉదాహరణగా చెప్పవచ్చు. దీనికి కారణం ఏమిటంటే విద్వేషాన్ని ఉద్బోధించడం తేలిక, ప్రేమించడాన్ని ప్రబోధించడం చాలా కష్టం.

**గురువుగారు :** పిల్లలు వాళ్ళ స్కూలును ఇష్టపడాలి,వారికి స్కూలంటే ఇష్టాన్ని కలిగించే విషయాలు ఏమిటి? పిల్లలు స్కూలు అంటే టీచరనే అనుకుంటారు. కాబట్టి టీచరు ఆత్మీయంగా ఉండాలి. అంతేగాని బెత్తం పట్టుకొని భయపడేలా ఉండకూడదు. పిల్లలకు టీచరంటే ఇష్టముంటే, టీచరు చెప్పేచదువును కూడా ఇష్టపడతారు. వాళ్ళు టీచరంటే భయపడుతున్నారనుకోండి, వాళ్ళు స్కూలన్నా, అక్కడ చదువుకోవడమన్నా భయపడతారు – చదువుపట్ల వారికి ఏహ్యాభావం ఏర్పడుతుంది. పిల్లలకు టీచరు నచ్చిన మరుక్షణం అన్ని సమస్యలు పరిష్కారమయినట్లే. కాబట్టి ఇదే ప్రధానమైన విషయం. వారికి టీచరంటే ఇష్టముండాలి, టీచరు వారికి నచ్చిన హీరోలాగో, హీరోయిన్‌లాగో ఉండాలి. అప్పుడు క్రమశిక్షణ, నేర్చుకోవడం అంటే ఇష్టం అన్నీ వాటంతటవే వస్తాయి. స్కూలులో ఇంటి గంట కొట్టగానే పిల్లలు ఎలా స్పందిస్తున్నారో చూడండి. పిల్లలు "హుర్రే హుర్రే" అని ఆనందంతో అరిచారంటే మనం విఫలమయినట్లే లెక్క.

పిల్లలు స్కూలులో సంతోషంగా ఉండాలి. ఎంతమంది పిల్లలు క్లాసులో ఆనందంగా ఉంటున్నారు? మార్కులు తెచ్చుకోవడానికో, ర్యాంకు కోసమో ఊరకనే అలా స్కూలుకు వెళ్లి చదువుకుంటున్నారు. ఆ తరువాత ఎంట్రన్స్‌లో మంచి కాలేజీలో సీటు తెచ్చుకొని, చివరగా విదేశాలకు వెళతారు – ఇదే నేటి భారతీయ యువత కంటున్న కల. నేనేమంటానంటే, విద్యను ఆనందదాయకంగా ఉండేట్లు చేస్తే వారు సులభంగా, సహజంగా విజయం సాధించి తీరతారు. చదువును ఆనందదాయకం చెయ్యడమంటే వారిని విజయం సాధించనీయకుండా చెయ్యడమని కాదు – అలా చదువుకున్న పిల్లలు బయట పోటీ ప్రపంచంలో కూడా తప్పక రాణిస్తారు.



**భక్తుడు** : పిల్లలు నేర్చుకోవడాన్ని ఇష్టపడేలా చెయ్యడానికి అవసరమైన ప్రోత్సాహకర వాతావరణం ఎలా వుండాలి?

**గురువుగారు :** ఎక్కడైతే విద్యాబోధన చక్కని ప్రణాళికతో సాగుతూ, పిల్లలకు మనం బోధిస్తున్నామన్న సంగతి తెలియకుండా ఉంటుందో అదీ ఆదర్శవంతమైన వాతావరణం. పిల్లలకు వారికై వాళ్ళే తామే ఇష్టపడి నేర్చుకుంటున్నాం అనే భావన ఉండాలి. అంతేగాని తప్పనిసరి కాబట్టి నేర్చుకుంటున్నాం అనిపించకూడదు. ఎవరైనా కావాలనుకుంటేనే ఏదైనా నేర్చుకోవడం జరుగుతుంది. అంతేగాని తప్పనిసరై నేర్చుకోవాలంటే నేర్చుకోలేరు. పిల్లలకు నేర్చుకోవడానికి స్వేచ్ఛ ఉండే వాతావరణాన్ని కల్పిస్తే అదే సరైన వాతావరణం. అలాకాకుండా, తప్పదు కాబట్టి విధిలేక నేర్చుకోవడంలా ఉండకూడదు. అటువంటి వాతావరణాన్ని సృష్టించడమనే ఆదర్శం ఊహాజనితమే కావచ్చు. (గురువుగారు నవ్వుతూ...) కానీ ఆచరణకు, ఆదర్శానికి మధ్య సమతుల్యాన్ని సాధించడానికి ప్రయత్నించాలి.

**భక్తుడు** : మా పిల్లలు చక్కగా నేర్చుకోవడంలో మేము వారికి ఎలా సహాయపడగలం?

**గురువుగారు :** పిల్లలలో కుతూహలాన్ని, జిజ్ఞాసను, తెలుసుకోవాలనే తపనను, ప్రశ్నించే స్ఫూర్తిని కలిగించి తద్వారా నేర్చుకోవటం పట్ల ఇష్టాన్ని పెంపొందించాలి. మనం ఇది రగిలింప చేయగలిగితే చాలు, మనం వాళ్ళకు బోధించినా బోధించకపోయినా పిల్లలు నేర్చుకుంటారు. పిల్లలే కాదు ఎవరైనా నేర్చుకుంటారు. ఇదే దానికి కీలకమూ, సూత్రమూ కూడా. పిల్లలలో నేర్చుకోవాలనే ఉత్సాహాన్ని కలిగించడానికి, వారిని ఆ ఉత్సాహంతో నింపడానికి విద్యావిషయంగా ఇప్పటివరకు పరిశోధించి తెలుసుకున్న విషయాలన్నీ ఈ సూత్రంలో ఇమిడిపోతాయి. ఆసక్తి ఉంటే పరిశీలన సహజంగానే వస్తుంది. పిల్లలకు ప్రకృతిని పరిశీలించండి అని చెప్తే సరిపోదు. వాళ్లు దానికి "సరే పరిశీలించాము, అయితే ఏమిటి?" అంటారు. ఎందుకంటే అక్కడ వాళ్లు మీరు చెప్పిన దానిని మొక్కుబడిగా చేసారు. ఇటువంటి పరిశీలన వలన ఎటువంటి ఉపయోగం ఉండదు. ముందు జిజ్ఞాస ఉండాలి, అప్పుడు పరిశీలనకు అర్థం ఉంటుంది. పరిశీలన యొక్క ఉద్దేశ్యం నెరవేరుతుంది.

నేను చెప్పేదేమిటంటే, ముందు మనం పిల్లలలో ప్రశ్నించే స్ఫూర్తిని రగిలించాలి. ఒకవేళ మనం ఒక విషయాన్ని పిల్లవాడికి నేర్పించదలచినప్పటికీ ముందు మనం ఆ పిల్లవాడికి ఆసక్తిని రేకెత్తించే ప్రశ్నలతో మొదలుపెట్టాలి- ఏదైనా కొత్త విషయాన్ని కనిపెట్టేముందు శాస్త్రజ్ఞుని మనఃస్థితి ఎలా ఉంటుందో అటువంటి మనఃస్థితి వారిలో కలిగించాలి. ముఖ్యంగా ఎక్కువగా కొత్త కొత్త ఆవిష్కరణలు జరిగే గణితం, పరిసరాల విజ్ఞానం మొదలైన అంశాలతో ఈ పద్ధతిని ప్రవేశపెట్టడం తేలికగా ఉంటుంది. ముందు పిల్లలను ఏదైనా విషయాన్ని గురించిన ప్రశ్నలతో ప్రేరేపించండి, వారి మనస్సు ఎప్పుడూ సంభ్రమాశ్చర్యాలతో ఉండాలి. ఆ తరువాత మీరు వేసిన ప్రశ్నలకు మీరే సమాధానాలు చెప్పండి. మీరు ప్రశ్నలు వేయడం వలన

"సమాధానం ఏమై ఉంటుందో" అని పిల్లలు తెలుసుకోవాలనుకుంటారు, సమాధానం పట్ల ఆసక్తి కలుగుతుంది. తరువాత మీరు సమాధానం చెప్పినపుడు, అది ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించినట్లవుతుంది. అంతేగాని కేవలం సమాచారాన్ని క్రుమ్మరిస్తే పిల్లలు దానిని గ్రహించలేరు. ఎందుకంటే వారికి తెలుసుకోవలసిన అవసరం లేదు. షేక్స్‌పియర్ ఎప్పుడు పుట్టాడో పిల్లలకు తెలియాల్సిన అవసరం ఏముంది? అది వాళ్లకు అవసరం కాదు. ఎలిజబెత్ మహారాణి శకం ఏమిటి? విక్టోరియా మహారాణి ఎప్పుడు సింహాసనం అధిష్టించింది? ఎవరికి కావాలి ఇవన్నీ? ఈ విషయాలు తెలుసుకోవడం పిల్లలకు అక్కరలేదు. కానీ వాళ్ళకు ఇవన్నీ తెలియాలని అందరూ ఆశిస్తారు, కాబట్టి వాళ్ళు బట్టీపట్టి గుర్తుపెట్టుకోవడానికి ప్రయత్నిస్తారు. అంతకుమించి వాళ్లు చెయ్యగలిగింది ఏముంది? మనం భారతీయ విద్యావ్యవస్థలో భాగం కనుక చదువు విషయంలో కంఠస్థం చెయ్యడాన్ని కాదనలేము. మనం దానిని మార్చలేం. పిల్లలు పరీక్షలు వ్రాయాలి, మిగతా పిల్లలతో పోటీ పడాలి. సమాజంలో మంచిస్థానంలో ఉండాలి. కాబట్టి గుర్తుపెట్టుకోవడాన్ని, కంఠస్థం చెయ్యడాన్ని ప్రక్కకు తీసివేయలేము. కానీ మనం దానికి కాస్త మరేదైనా జత చేయవచ్చు. కాస్త ఆసక్తిని కలిగించే రుచిని జోడించవచ్చు. ఇదంతా పిల్లల పరిణితిని బట్టి, వయస్సునుబట్టి, వారికి తగిన సందర్భాన్ని, మానసికస్థితిని సృష్టించగలిగిన మన సామర్థ్యం మీద ఆధారపడి ఉంటుంది. నేను మీకు కొన్ని చిట్కాలు మాత్రమే ఇస్తున్నాను. ఇవి అందరు పిల్లలకు, అన్ని సందర్భాలలో ఒకే విధంగా వర్తిస్తాయని కాదు.



**గురువుగారు :** పిల్లల చదువు విషయంలో ప్రీస్కూలు అత్యంత ముఖ్యమైనది. మనస్సు వికసించే ఆ చిన్నవయస్సులోనే మనం పిల్లలలో నేర్చుకోవడం పట్ల ఇష్టాన్ని కలిగించగలం. అది నిర్ణయాత్మకమైన సమయం.

నేర్చుకోవడం కన్నా కంఠతా పెట్టడం మీదనే దృష్టిపెట్టడం వలన అసలు నేర్చుకోవడం పట్లే ఇష్టాన్ని కోల్పోయిన వారిని నేను చాలా మందిని చూసాను. పిల్లలు ఎలా నేర్చుకుంటారో గమనించండి, పిల్లలే కాదు మనమైనా సరే! ముందుగా పిల్లలు వస్తువుల పేర్లు గుర్తిస్తారు. ఇది కుర్చీ, ఇది టేబుల్, ఇది ఫలానా, ఇది ఇల్లు, అది చెట్టు... అని వస్తువులను గుర్తించి, తరువాత వారి మాతృభాషలో మాట్లాడటం మొదలుపెడతారు. అది ఇంగ్లీషు అయినా, తెలుగైనా! చిన్న పిల్లలు వ్యాకరణబద్ధంగా చక్కగా మాట్లాడతారు. అలాగని వారికి వ్యాకరణం తెలుసా? చిన్నపిల్ల దగ్గరకు వెళ్లి, "మీ నాన్న ఎక్కడకు వెళ్ళాడు?" అని అడిగితే, "మా నాన్న ఆఫీసుకు వెళ్ళాడు", "మా నాన్న ఢిల్లీకి వెళ్ళాడు" అని చెబుతుంది. స్త్రీ, పురుష లింగ బేధాన్ని, జరిగిపోయిన కాలాన్ని సరిగా చెబుతుంది. ఆమెకు అవన్నీ ఎలా తెలుసు? ఆ వ్యాకరణాన్ని ఎవరు నేర్పించారు? చుట్టుప్రక్కల వాళ్ల మాటలు విని ముందుగా మాట్లాడటం నేర్చుకుంటుంది. ఇంకా తదుపరి వ్యక్తీకరణ అవసరం అయినప్పుడు వ్రాయడం అనే విషయం వస్తుంది. కానీ భారతదేశంలో



చదువు ముందు వ్రాయడంతో మొదలవుతుంది. కాబట్టి నేర్చుకునే పద్ధతి మొత్తం తలక్రిందులుగా ఉంటుంది.

ముఖ్యమైన విషయం ఏమిటంటే చదువు నేర్చుకోవడం పిల్లలకు ఒక ఆటలా ఉండాలి, కారణం వాళ్ల దృష్టిలో నేర్చుకోవడానికి ఏ అర్ధమూ లేదు. వాళ్లు స్కూలుకు వెళ్లిన మరుక్షణం నుండి అక్షరాలు నేర్పిస్తారు. అసలు వాళ్లు ఎందుకు అక్షరాలను నేర్చుకోవాలి? నిజానికి అది అర్ధంలేని పని! రెండు మూడు సంవత్సరాల పిల్లలకు ఏం అర్ధమవుతుంది? ముందు మనం చేసే అర్ధరహితమైన విషయాలపట్ల మనకు అవగాహన ఉండాలి! కాబట్టి పిల్లలకు వీటిని కాస్త అర్ధవంతంగా ఉండేలా చెయ్యడానికి ప్రయత్నించాలి. అదెలా అనే విషయం టీచరు యొక్క ప్రతిభపై ఆధారపడి ఉంటుంది.

చాలా వరకు ఈ కారణంగానే విద్యావిధానం పిల్లలు నేర్చుకునేలా చేయడంలో విఫలమవుతుంది, చాలామంది పిల్లలు చదువుపట్ల విముఖత చూపడానికి కూడా ఇదే కారణం. వాళ్లకు స్కూలుకు వెళ్లడమంటేనే అయిష్టం. వాళ్లకు వాళ్ల టీచర్లన్నా అయిష్టమే. ఎందుకంటే టీచర్లు వీళ్లచేత వీళ్లకు ఇష్టంలేని పనులు చేయిస్తారు కాబట్టి నేర్చుకోవడాన్ని అర్ధవంతంగా ప్రయోజనకరంగా మార్చడం ఎలా? మనం చెయ్యగలమా? మనం ప్రయోగాత్మకంగా ఆ దిశగా ప్రయత్నిద్దాం. అందుకనే ముందు నేను నేర్చుకోవడాన్ని ఇష్టపడేలా చెయ్యడం ముఖ్యమని చెప్పాను.

పిల్లలకు తమకు బోధిస్తున్నారు అనే విషయమే తెలియకుండా ఉండటం చాలా ముఖ్యమైన విషయం. ఆటలు, పాటలు, కథలు ఇలా రకరకాల మార్గాలలో చెప్పవచ్చు. చూసేవాళ్లకు వీళ్లు ఏమీ చెప్పడం లేదు అని అనిపించవచ్చు, "ఈ ఆటలు, పాటలు, నృత్యాలు ఏమిటి" అనిపించవచ్చు. కానీ ఇటువంటి కార్యక్రమాల ద్వారానే పిల్లలు సహజంగా నేర్చుకుంటారు. పిల్లలు అలా సహజంగా నేర్చుకోవడమే నాకు ఇష్టం.

**భక్తురాలు :** ఒక తల్లిగా నా పిల్లలు చదువులో బాగా రాణించాలని నా కోరిక. పిల్లలకు అటువంటి కోరిక లేకపోయినా నాకు అలా ఉండటం సరైనదేనా?

**గురువుగారు :** మనం చిన్నపిల్లలుగా ఉన్నప్పుడు మన విషయమూ అంతేకదా. తల్లిదండ్రులందరూ పిల్లలకోసం ఆశించేవన్నీ పిల్లలకు ఇష్టమైనవిగా ఉండవు. అప్పుడైనా ఇప్పుడైనా అది ఒక్కటే. నీ పిల్లల స్థానంలో నువ్వుండి చూడు, అప్పుడు సమస్య ఉండదు. అలాంటి కోరిక ఉండటం మంచిదే. పిల్లలు కూడా వ్యక్తులే. వారికి ఒక వ్యక్తిత్వం ఉంటుంది, పిల్లలకు వారి గురించి వారిదైన ఒక స్వీయ ఊహారూపం ఉంటుంది. వారి కోరికలు, కారణాలు వారికుంటాయి. మీకు మంచిదనిపించిన దానిని వారికి అందించడానికి మీకు సాధ్యమైనంత మేరకు ప్రయత్నించండి. మనం దాని గురించి ఎక్కువగా ఆందోళనపడాల్సిన అగత్యం లేదు అన్న ఒక్క విషయాన్ని మాత్రం గుర్తుంచుకోవాలి.



**భక్తురాలు :** మనం చదువుకోమని బలవంతపెట్టవచ్చా?

**గురువుగారు :** పెట్టవచ్చు. పిల్లలకు సహాయం కావాలి కాబట్టి మీరు సాయం చేయవచ్చు. మనం వాళ్లని ప్రేమిస్తాం కాబట్టి బలవంతపెడతాం. తల్లి తన బిడ్డకు నడక నేర్పాలని ప్రయత్నిస్తున్నదనుకుందాం. తానేదో శిక్ష విధిస్తున్నాను అని ఆ తల్లి అనుకుంటుందా? ఆ పాప తడబడి పడిపోతుంది, కొన్నిసార్లు గీచుకుంటుంది, దెబ్బలు తగులుతాయి. అయినా తల్లి "ఇలా రా నడువు, నడువు" అని ప్రోత్సహిస్తుంది.ఆ చిన్నపాప నడిచి దగ్గరకు వచ్చేటప్పటికి, ఈమె మరో మూడడుగులు వెనక్కి వేసి "వచ్చెయ్, వచ్చెయ్" అంటుంది. అలా వచ్చి వచ్చి సరిగ్గా పట్టుకునే సమయానికి మళ్ళా వెనకకు వెళ్లి "వచ్చెయ్ వచ్చెయ్" అంటుంది. ఆ తల్లి తన బిడ్డను శిక్షించడం లేదు, పీడించడం లేదు. అలా చెయ్యడాన్ని తాను ఇష్టపడదు కూడా. తన ఉద్దేశ్యం అది కాదు. తన బిడ్డ ఒక ముఖ్య విషయం నేర్చుకోవాలని ఆశిస్తోంది. చూడటానికి ఆ తల్లి పాపకు దూరంగా వెళ్లిపోతున్నట్టు – బాధపెడుతున్నట్లు, పరీక్షిస్తున్నట్లుగా కనిపిస్తుంది. మీ విషయమైనా అంతే, ఒకవేళ మీరు మూడు అడుగులు ముందుకేసినా సద్గురువు మూడడుగులు వెనక్కి వేసి, "మళ్ళీ రా" అంటారు. ఏమి చెయ్యాలో ఆయనకు తెలుసు.

**భక్తుడు :** నా పిల్లలు మంచి నైతిక విలువలతో పెరగడం నాకు చాలా ముఖ్యం. పిల్లలను మంచి విలువలతో తీర్చిదిద్దడం ఎలా?

**గురువుగారు :** నైతిక విలువలను సైన్సులాగా బోధించాలి. సైన్సు అంటే స్వేచ్ఛగా ఆలోచించడం. సైన్సు అంటే ఆలోచించడం, ప్రశ్నించడం, పరిశోధించడం. నువ్వు వారిని నైతిక విలువల గురించి స్వయంగా ఆలోచించి, వాటి గురించి తెలుసుకునేలా, వాటిని పరిశోధించేలా చెయ్యగలగాలి. అదీ నిజంగా నైతిక విలువలను బోధించడం. అంతేగాని ఊరికే "అబద్ధాలు చెప్పవద్దు. పెద్దలను, ఉపాధ్యాయులను గౌరవించాలి" అని ఊరికే నోటిమాటగా చెప్పడం కాదు. నైతికత గురించి, మానవ విలువల గురించి వారితో మాట్లాడండి. అవి ఎందుకు అవసరమో వారికి తెలియచేయండి.

నాకు స్వేచ్ఛగా ఆలోచించడమంటే ఇష్టం. పిల్లలకు శాస్త్రవేత్తల గురించి తెలియచేయండి. బాబా జీవితం గురించి, రమణమహర్షి, వివేకానందుల జీవిత చరిత్రల గురించి మాత్రమేకాదు, న్యూటన్ గురించి, ఐన్‌స్టీన్ గురించి కూడా చెప్పండి. కొత్త విషయాలను కనుగొనడం, సాహసం చేయడమనే స్ఫూర్తిని వాళ్లలో నింపండి. గొప్ప శాస్త్రవేత్తలు, గొప్ప మహాత్ముల జీవితాలకు సంబంధించిన సినిమాలను వారికి చూపించి ఒక్క విషయాన్ని గట్టిగా చెప్పండి – అదే సాహసం! మీరు వాళ్లలో ఆ సాహసాన్ని, ఆ తెగువను కలిగించగలగాలి. ఇవీ నైతిక శాస్త్రాలంటే. అంతేగానీ సిద్ధాంతీకరింపబడిన శాస్త్రవాక్యాలుగాని, సూత్రాలుగాని కాదు.

**గురువుగారు :** చిన్నపిల్లవాడు ఎలా పెరిగి పెద్దవాడవుతాడో గమనించండి. ఒక దశకు చేరుకునేటప్పటికి వాడు ఆటవస్తువులతో ఆడుకోవడాన్ని ఇష్టపడడు. ఎందుకంటే కాస్త పరిణతి వచ్చి నిజమైన ప్రపంచం



నుండి ఆనందం పొందడం మొదలుపెట్టాక ఆటబొమ్మలు అంత ఆకర్షణీయంగా కనిపించవు. అంత సంతోషాన్నీ ఇవ్వవు. అందుకని అవి నెమ్మదిగా ప్రక్కకు వెళ్లిపోతాయి. ఎదుగుదల అలా జరుగుతుంది. ఒక మొగ్గ రేకులను చేతులతో విప్పి దానిని రాత్రికి రాత్రి పువ్వుగా మార్చలేము. అది పువ్వుగా మారడానికి కావలసిన మంచి ఎరువు, నీళ్లు, సూర్యరశ్మి ఇలాంటి వాటినన్నింటినీ అందివ్వాలి. అప్పుడు ఆ మొగ్గ తనంతట తానే వికసించి పువ్వుగా మారుతుంది.

విద్య విషయంలో శ్రీబాబూజీ దృక్పధానికి వారు స్థాపించిన శ్రీసాయిబాబా సెంట్రల్ స్కూల్ ఉదయపు ప్రార్థన అద్దం పడుతుంది.

**School Pledge and Prayer**

May my mind be always given to the spirit of enquiry and learning
I'll never let my eye of reason be blinded
by dry and dead habit and superstitions;
I do not let my mind be subject to narrow and ugly prejudices
of class, caste, creed, religion and nationality;
I love my country and strive to realize the ideal of being a world citizen;
I always act towards others, as I desire them to act toward me;
I do nothing that will bring discredit
on myself, my teachers or my fellow pupils.
May my mind be without fear and my head always held high;
I will strive at all times to keep my school a lovely and happy place,
so that all of us may be proud of it.
This is my solemn pledge and soul's prayer.

## నమ్మకం - సెప్టెంబర్ 2013



**భక్తుడు** : గురువుగారూ! మేము నమ్మకాన్ని కలిగిఉండటం ఎలా?

**గురువుగారు :** మీరు నమ్మాలనుకుంటే నమ్ముతారు. అసలు నమ్మడం అనేది సమస్య ఎందుకవుతుంది? నమ్మకమంటూ లేకపోతే రోజువారీ జీవితంలో మీరు ఏం చెయ్యగలరు? అయితే, ఆ నమ్మకం గుడ్డిగా ఉండవలసిన అవసరం లేదు. మనమెప్పుడూ నమ్మకం, విశ్వాసం గుడ్డిగా, వెర్రిగా, మూఢంగా, హేతుబద్ధత లేకుండా ఉంటాయని అనుకుంటాం. కానీ అన్ని సందర్భాలలో అలా ఉండదు. మీ జీవితంలో ప్రతినిత్యం మీరు చాలా విషయాలను నమ్ముతారు. నమ్మకం అనేది లేకపోతే మీ జీవితం గడవదు. మీ భార్యాపిల్లల్ని నమ్ముతారు, స్నేహితులనూ, పనిమనుషులనూ నమ్ముతారు. బ్యాంకులో డబ్బులు డిపాజిట్ చేసేటప్పుడు ఆ డబ్బులు బ్యాంకులో భద్రంగా ఉంటాయని నమ్ముతారు. మీరు కారులో ప్రయాణించే ముందు, మీరు ఆ కారును నమ్మాలి. ఇంతకుముందు కారుని వాడినపుడు ఎటువంటి ఇబ్బందులు



తలెత్తలేదు కాబట్టి అది మంచి కండీషన్‌లో ఉందని, టైర్లు గట్రా బాగానే ఉన్నాయని ఆ కారును నమ్ముతారు. ఆ నమ్మకం ఆధారంగా ఆ కారులో ప్రయాణం చేస్తారు. అది సహేతుకమైన నిర్ణయం అవుతుంది.

సరైన అవగాహనతో మనం ఒక నిర్ణయాన్ని తీసుకున్నప్పుడు దానికి ఆధారమైన ఒక ధృఢమైన నిశ్చయంగా మారుతుంది. ఏదో ఒక ప్రీతికరమైన లక్ష్యంపట్ల నమ్మకం, ధృఢనిశ్చయం ఉంటే అదే విశ్వాసంగా మారుతుంది. ఈ నమ్మకమూ, విశ్వాసమూ సహేతుకమైన అవగాహనతో, వివేకంతో కూడుకున్నపుడు అది భక్తి అవుతుంది. మీరు అలాంటి భక్తితో ముందుకు సాగితే, అది అనుభవంగా మారుతుంది.

మనం ఎన్నో విషయాలను నమ్ముతూ ఉంటాం, కానీ భగవంతుని నమ్మడానికి, సద్గురువును నమ్మడానికి ఒప్పుకోము. తక్కిన అన్ని విషయాలలో మనం చాలా హేతుబద్ధంగా, విచక్షణతో, తెలివితేటలతో ప్రవర్తిస్తున్నామనుకుంటాం. కానీ సద్గురువును నమ్మడమనే విషయం దగ్గరకు వచ్చేటప్పటికీ, "ఇదంతా అంధవిశ్వాసం, మూఢనమ్మకం, వెర్రితనం" అంటాం. ఎందువల్ల? ఎందుకంటే సద్గురువు ప్రసాదించేది మనకు అక్కరలేదు కాబట్టి. మీకేదైనా కావాల్సివచ్చినపుడు మీరు నమ్ముతారు, ఆ నమ్మకం మీకు చాలా సహజంగా, సహేతుకంగా ఉంటుంది. ఉదాహరణకు, మీ ఇంట్లో పనిమనిషిని నమ్ముతారు, ఆ నమ్మకం మీకు చాలా సహజంగా, సహేతుకంగా ఉంటుంది. ఉదాహరణకు, మీ ఇంట్లో పనిమనిషిని పెట్టుకోవాలను కొన్నారనుకోండి. మీరు ఆ వ్యక్తితో మాట్లాడతారు, అంతకుముందు అతను పనిచేసిన వాళ్ల వివరాలు కనుక్కొని, వాళ్ల దగ్గర నుండి "ఫలానా వ్యక్తి మీకు తెలుసా? అతనిని నమ్మవచ్చా?" అని వివరాలు కనుక్కొంటారు. ఆ వ్యక్తిని పనిలో పెట్టుకొని కొన్నిరోజులపాటు అతనిని గమనిస్తారు. ఎటువంటి అవాంఛనీయమైన ఘటనలు జరుగకపోతే, మీరు అతనిని నమ్ముతారు – మొత్తం ఇంటిని అప్పచెప్పి మీరు ప్రయాణాలకు కూడా వెళ్లిపోతారు. మీరు ఒక పనిమనిషినైతే నమ్ముతారు కాని బాబా వంటి సద్గురువును మాత్రం నమ్మరు! ఎంత దయనీయమైన స్థితి అది!

నీల్‌ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రుడు మీద నడిచాడంటే మీరు నమ్ముతారా? ఆయన నడవడం మీరు చూసారా? మీరేదో కొన్ని ఫొటోలను చూసుంటారు. అవి నకిలీవి అయ్యివుండవచ్చు కదా? అయినప్పటికీ మనం అటువంటి విషయాల ప్రామాణికతను ఒప్పేసుకుంటాం. కానీ సద్గురువు వద్ద ఏదైనా అనుభవం వచ్చినపుడు "ఇదేదో అదృష్టం కొద్దీనో, కాకతాళీయంగానో జరిగింది, దానివల్ల జరిగివుండవచ్చు. దీనివల్ల జరిగి వుండవచ్చు" అని అనుకుంటాం.

మీరు నిజంగా నమ్మవద్దనుకుంటే, జీవితంలో ఏ విషయాన్ని నమ్మవద్దు, సత్యాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నించండి – అది నాకు నచ్చుతుంది. మీ జీవితంలో ఏ ఇతర కోణాన్నీ సందేహించని మీరు, మీ ఆధ్యాత్మిక సాధనను మాత్రమే సందేహించడం బలహీనత అవుతుంది. మీరు ప్రతి విషయాన్నీ సందేహించండి, ప్రశ్నించండి – చివరకు మీ ఉనికిని కూడా సందేహించండి – భగవాన్ చేసింది కూడా అదే. ఆయన "నేనెవరు?" అని విచారణ చేసారు.



మీరెవరో మీకు తెలియదు, ముందుగా మీరెవరు అనేదానిని సందేహించండి. మీరు ఫలానా అని నమ్ముతారు, ఒక పేరు, ఒక గుర్తింపు ఉందనుకుంటారు. కానీ అది నిజమో, కాదో సందేహమే! భగవాన్ రెండు రకాల అహంకారాలు ఉంటాయి అని చెప్పారు. అసత్యమైన అహం, (నిజమైన ఆత్మ) 'నిజమైన నేను' ఉందని భగవాన్ చెప్పేవారు. దానిని తెలుసుకోవడానికి ప్రయత్నించండి, ముందు దానినీ సందేహించండి - భగవాన్ చెప్పారు కాబట్టి నమ్మవద్దు. దానికంటే ముందు "నేనెవరు?" అని ప్రశ్నించుకోండి. అప్పుడు నిజమైన ఆత్మవిచారణ మొదలవుతుంది. కానీ మీరసలు ఎప్పుడూ ఇలా సందేహించరు, ప్రశ్నించుకోరు. భగవాన్ చెప్పినదానిని ఊరకనే నమ్మి ఆ నమ్మకాన్ని పట్టుకొని ముందుకెళతారు, దాని ఆధారంగానే విచారణ చేస్తారు. ఒక నమ్మకాన్ని అనుసరించి విచారణ చేయడం వలన ప్రయోజనం ఏమిటి? నేను మిమ్మల్ని నమ్మవద్దనే చెబుతున్నాను! సందేహించండి, ఆ సందేహనివృత్తి కోసం నిర్దిష్టంగా ఏదైనా చెయ్యండి: నిజమైన సందేహం కలిగివుండండి! నిజమైన విచారణాస్ఫూర్తిని కలిగివుండండి! ఎంతమంది ఇలా ఉంటారు?

సాధారణమైన గుడ్డినమ్మకాన్ని ప్రోత్సహించని వారిలో నేను మొదటివ్యక్తిని. మనిషి ఒక ప్రత్యేకమైన హేతుబద్ధత గల జీవి అని నేను నమ్ముతాను. కాబట్టి ఎవరైనా మనిషిగా ఉండాలంటే హేతుబద్ధంగా ఉండాలి. అలా కాకపోతే వాళ్ళసలు మనుషులే కాదు. తార్కికంగా చూస్తే తేలేది అదే కదా? కాబట్టి హేతుబద్ధంగా ఉండాలి, హేతుబద్ధంగా ఉండటమంటే దానర్ధం అసలు నమ్మకాలే ఉండకూడదని, సందేహాలే ఉండకూడదని కాదు. సందేహంలో నిజాయితీ ఉండటం మంచిది.

**భక్తుడు :** ఎప్పుడూ సందేహాలతోనే ఉండటం విసుగును కలిగిస్తున్నది.

**గురువుగారు :** నీ సందేహం నిజమైనదే అయితే, ఆ సందేహాన్ని తీర్చే పరిష్కారాన్ని నువ్వు కనుక్కోగలవు. భౌతికశాస్త్రంలో ఏదైనా సహజసూత్రాలను కనిపెట్టడానికిగాని, తెలుసుకోవడానికిగాని ముందు ఒక సిద్ధాంతాన్ని ఊహించుకోవడం తప్పనిసరి. మొదట సైంటిస్టు ఏదో ఒక దానిని ఊహించి దానితో పరిశోధన చేస్తాడు. ఆ ఊహ సరైనదేనని అతను అనుభవం ద్వారా తెలుసుకొంటేనే, ఆ తర్వాతే అది ఒక సూత్రం అవుతుంది. అంతకుముందు అది శాస్త్రీయం కాదు. నేను మిమ్మల్ని శాస్త్రీయంగా సాధన చెయ్యమంటున్నాను. ముందు సందేహించండి! ఆ సందేహాన్ని ఆధారంగా చేసుకొని ఒక ఊహకు రూపకల్పన చేయండి. ఆ తరువాత ఆ ఊహను మీకు కలిగే అనుభవంతో పరీక్షించండి. సత్యం మీకు గోచరించినపుడు, దాని వెనుక ఉండే సహజసూత్రాన్ని తెలుసుకుంటారు. ఈ ఫలితాన్నే నేను అనుభవం అంటాను.

**భక్తుడు :** కొన్ని సందర్భాలలో నేను నా ఉనికినే శంకిస్తాను.

**గురువుగారు :** నువ్వు నిజంగానే నీ ఉనికిని సందేహిస్తున్నావా? ప్రతి ఒక్కరూ ఏదో ఒక సమయంలో తమ ఉనికిని శంకించేవారే, కానీ వాళ్ళ సందేహం ఎక్కువకాలం ఉండదు. నీకంత తీవ్రమైన సందేహం ఉంటే దాని

మర్మం తెలిసేదాకా నువ్వు అన్వేషించాలి – అది ఊరకే కాలక్షేపం కోసం చేసేదిలాగా ఉండ కూడదు. నేను ఇటువంటి ఉబుసుపోని కుతూహలం గురించి మాట్లాడటం లేదు, అవసరం మీద ఆధారపడిన అసలయిన జిజ్ఞాస గురించి మాట్లాడుతున్నాను. నిజమైన జిజ్ఞాస ఉండాలంటే అక్కడ ఆ అవసరం ఉండాలి. కాబట్టి ఇది మనల్ని తిరిగి – "నీకు నిజంగా ఏం కావాలో తెలుసుకో" అనే నా మౌలికమైన సూత్రం దగ్గరకు తీసుకెళుతుంది.



**భక్తుడు** : గురువుగారూ! నమ్మకం అనేది లేకుండా జీవించడం సాధ్యమవుతుందా?

**గురువుగారు :** అలా జీవించడం సాధ్యమే, కానీ సాధారణంగా ఎవ్వరూ అలా ఉండరు. "అవును, ఎటువంటి నమ్మకమూ లేకుండా జీవించవచ్చు" అని నేను చెప్పాననుకో, నేను చెప్పిన దానిని నువ్వు నమ్ముతావు. అప్పుడు నమ్మకం లేకుండా జీవించవచ్చు అనే నమ్మకంతో నువ్వు జీవిస్తుంటావు (గురువుగారు నవ్వుతూ...)

**భక్తుడు** : ఏ నమ్మకాలూ లేకుండా జీవించాలనుకోవడం మంచిదేనా?

**గురువుగారు :** నీ ఆనందానికి అడ్డు రానంతవరకు, నమ్మకాలతో వచ్చిన సమస్యేమీ లేదు.

**భక్తుడు** : కానీ నమ్మకాలు కొన్నిసార్లు స్వేచ్ఛ లేకుండా, పరిమితులను సృష్టించి ఆనందానికి దూరం చేస్తున్నాయి.

**గురువుగారు :** స్వేచ్ఛను పరిమితం చేసే ఆ నమ్మకాలే, పరిమితులకు అతీతంగా వెళ్లడానికి కూడా తోడ్పడుతాయి.

**భక్తుడు** : మన పరిమితుల పట్ల కూడా మనకి కాస్త నమ్మకం ఉంటుందని నేను అనుకుంటాను.

**గురువుగారు :** నీకు ఆ పరిమితులు ఉన్నాయన్న నీ నమ్మకమే దానికి అతీతంగా పోవాలన్న నీ కోరికకు కారణం. నిజానికి అది నీకు ఉపయోగపడుతోంది. అలా అయినపుడు అది ఇక ఎంతమాత్రమూ నమ్మకం కాదు, అది నీ అనుభవం.

**భక్తుడు** : మేము పరిమితులం అన్న నమ్మకం పరిమితులను అధిగమించాలనే ప్రేరణను ఎలా ఇస్తుంది?

**గురువుగారు :** నీకు పరిమితులున్నాయి అని నువ్వు నమ్మకపోతే, దానికి అతీతంగా పోవడానికి నువ్వు ప్రయత్నం చెయ్యవు. "నేను ఆనందంగా ఉన్నాను, నేను సంతృప్తిగా ఉన్నాను, నాకు విచారమే లేదు, నాకు బంధనాలు లేవు, నేను ముక్తుణ్ణి..." అని నువ్వు నమ్మితే, దానిని అధిగమించాలని నువ్వు ప్రయత్నించవు. నేను చెప్పేది ఏమిటంటే, నువ్వు నీ పరిమితుల పట్ల నమ్మకం అని దేనినైతే అంటున్నావో అది నమ్మకం కాదు, అది వాస్తవం. అవి నమ్మకాలే కావలసిన అవసరం లేదు. అందుకే నేనెప్పుడూ నీ అనుభవం మీదనే ఆధారపడమంటాను. నమ్మకాలను పెంచి పోషించడాన్ని నేను సాధారణంగా ప్రోత్సహించను. కానీ మనకు కొన్ని అమాయకమైన నమ్మకాలు ఉంటాయి. అటువంటి వాటితో సమస్య లేదు.

**గురువుగారు :** నాకు సంబంధించినంత వరకు, మీ స్వంత అనుభవాన్ని మించిన ప్రమాణమే లేదు. నేను శాస్త్రాల ప్రామాణికతను తప్పుపట్టడం లేదు. "శాస్త్ర ప్రమాణాలను గౌరవించవద్దు, శాస్త్రాలను నమ్మవద్దు, గురువులను నమ్మవద్దు, వారి ప్రబోధాలను నమ్మవద్దు" అని నేను చెప్పడం లేదు. మీరు అనుభవిస్తున్న



నిస్పృహ, దుఃఖం, మీలో అవ్యక్తంగా అస్పష్టంగా ఉన్న పూర్ణత్వభావన ఇవన్నీ మీ అనుభవంలో ఉన్న యదార్ధ విషయాలు. అందుచేత వీటిని నమ్మడం, విశ్వసించడం అనే సమస్యే ఉత్పన్నం కాదు. ఈ విషయం తెలుసుకోవడానికి మీకు ఏ శాస్త్రాలు అక్కరలేదు. సద్గురువును చేరుకున్నప్పుడు ఆయనవద్దనుండి ప్రకటమయ్యే ప్రేమ, ఆ క్షణంలో మీలో కలిగే ప్రేమ ప్రతిస్పందన.. ఇలా కూడా మీ అనుభవమే! దీనిని ధృవీకరించడానికి నీకు వేరే శాస్త్రాలుగాని, ప్రామాణికతలుగాని అవసరం లేదు. ప్రపంచం మొత్తం ఆయనను (సద్గురువును) నమ్మవద్దు అని చెప్పినప్పటికీ నువ్వు ప్రేమిస్తావు. ఒకవేళ నీలో ఆ ప్రేమభావం కలుగకపోతే, ప్రపంచం మొత్తం "ఆయనను ప్రేమించు" అని చెప్పినా ప్రేమించలేవు. ఇలాగే మీ అనుభవాన్ని ప్రమాణంగా భావించమని నేను చెప్తున్నాను. ఉదాహరణకు మీ దగ్గరున్న సెల్‌ఫోన్ విషయం తీసుకోండి. మీ ఫోను సరిగా పనిచేయడం లేదు, దానిని రిపేరుకు ఇవ్వాలి. ఏం చేస్తారు? మీ స్నేహితుణ్ణి అడుగుతారు, "నా ఫోన్ సరిగా పనిచేయడం లేదు, బాగా రిపేరు చేసేవాళ్లు ఎవరన్నా తెలుసా?" అని. దానికి అతను, "బాగా రిపేరు చేసే అతను నాకు తెలుసు, క్రిందటిసారి నా ఫోనును అతను చక్కగా రిపేరు చేసాడు" అంటాడు. ఆ తరువాత ఈ మధ్యే ఫోన్ రిపేర్ చేయించుకున్న ఇంకొకరిని ఎక్కడ రిపేరు చేయించారో కనుక్కొంటారు. ఈ విధంగా మీకు వీలైనంత సమాచారాన్ని సేకరిస్తారు. అప్పుడు మీరు సేకరించిన సమాచారం ఆధారంగా మీరు ఫోనును బాగా రిపేరు చేసే వ్యక్తికి అప్పగిస్తారు. అతను బాగు చేయగలడని మీకు ఖచ్చితంగా తెలుసా? ఆ రిపేరు షాపతను అంతకుముందు వెయ్యిఫోనులు రిపేరు చేసి వుండవచ్చుగాక, నీ ఫోనును సరిగా రిపేరు చేస్తాడని గ్యారంటీ ఏమిటి? నీ ఫోను అతనికి ఇవ్వడానికి కారణం ఏమిటి? వేరేవాళ్ల అనుభవాన్ని నమ్మడమే కదా? అది హేతుబద్ధంగా చెయ్యడమవుతుందా లేక వెర్రితనం అవుతుందా? ఏ విషయం గురించైనా తగినంత సమాచారం సేకరించి దాని ఆధారంగా నిర్ణయాలు తీసుకోకుండా, అటువంటి నమ్మకం లేకుండా ప్రపంచంలో నడుచుకోవడం సాధ్యమవుతుందా? మీ ఫోన్ బాగైనా, కాకపోయినా చివరకు మీ అనుభవమే మీకు ప్రామాణికమవుతుంది. ఒకవేళ అతను రిపేర్ చెయ్యలేకపోతే నువ్వు మరొకరిని వెతుక్కుంటావు.

**గురువుగారు:** హేతుబద్ధంగా ఉండటం, విశ్వాసంతో ఉండటం అనేవి రెండు పరస్పర విరుద్ధమైన విషయాలనీ, ఆధ్యాత్మిక పథంలో పయనించేవారికి నమ్మడం తప్పనిసరి అని మీరు అనుకుంటారు. కానీ నేను నమ్మకాలను ఏ మాత్రమూ నమ్మను. విశ్వాసం, నమ్మకం ఇటువంటి విషయాలను నేనసలు పట్టించుకోను. ఆధ్యాత్మికమైన ఒక లక్ష్యాన్ని పొందడానికోసమని నేను దేనినీ నమ్మలేదు. ఒక నమ్మకాన్ని అనుసరించి పోవడానికి నేనెప్పుడూ ప్రయత్నించలేదు. నాకు అలా చేయడం ఇష్టముండదు. నాకు నేనేదో పొందుతున్నాను అనే భావన ఉండేది, అది నా అనుభవం. ప్రత్యక్షమైన అనుభవం రాకమునుపు నమ్మడం అన్న ప్రశ్నకు తావెక్కడుంది? మీ అనుభవం ఎంతమేర ఉందో అంతమేరకే నమ్మండి. అందుకనే నేను ఎవ్వరినీ బాబాను నమ్మమని చెప్పను. మీరు బాబాను నమ్మితే తప్ప ఆయన మీకు సాయం చెయ్యడు అని నేను చెప్పగా మీరెప్పుడన్నా విన్నారా? నేను ఎప్పుడైనా అలా చెప్పానా? ఎవరైనా నాకలా చెబితే బహుశా నేను, "ఆయన నాకు సాయం చెయ్యకపోతే నేనెలా నమ్ముతాను"?

అని అంటాను. ముందు చెప్పిన పని చేయని సెల్‌ఫోన్, దానిని రిపేరు చెయ్యడం ఉదాహరణలో మాదిరిగా ఈ విషయంలోనూ అటువంటి సాధారణమైన తర్కాన్నే అన్వయిస్తున్నాను. ముందుగా మీకు సాధ్యమైనంతమేరకు ప్రయత్నిస్తారు. ఒక నమ్మకంతోనో, కారణంతోనో, సందేహంతోనో మొదలుపెడతారు. మీరు సాయం కోరతారు, మీకు సాయం అందితే అది మీ అనుభవమవుతుంది. అప్పుడు ఇక అది ఎంతమాత్రమూ నమ్మకం కాజాలదు, అది మీ స్వంత అనుభవమవుతుంది.



**భక్తుడు** : ఒకవేళ ఎప్పుడైనా మీ సన్నిధిలో మాలోని భయాలు బయటకు వచ్చి, వాటిని అణుచుకొని నిగ్రహించుకోవాల్సిన అవసరం ఏర్పడినపుడు ఏమిటి చెయ్యడం?

**గురువుగారు :** మీరు నా దగ్గరకు వచ్చినపుడు మీలో భయాలు ఉన్నప్పటికీ అదే సమయంలో మీకు పట్టుకోవడానికి ఒక ఆధారమూ కూడా ఉంటుంది. మీకు భయం ఉన్నప్పటికీ, దానితోపాటే కావాల్సిన బలం, ఆధారం కూడా ఉంటుంది. మీరు భయపడతారు, కానీ భయపడాల్సిన అవసరం ఉండదు. బాబా చెప్పినట్టు, "నేనుండగా భయమెందుకు?"

**భక్తుడు** : ఆ ఆధారం లేదా భద్రతాభావము కూడా మరొక రకమైన నమ్మకమే కదా?

**గురువుగారు :** ఏదో ఒక నమ్మకం మీకు ఆధారంగా ఉపయోగపడితే, అది మీలో అప్పటికే మార్పును తీసుకొచ్చి ఉండాలి. అసలు విషయమేమిటంటే, మీ నమ్మకము మీకు అవసరమైనంత భద్రత ఇవ్వలేకపోయినపుడు – అది సమస్య అవుతుంది – మీరు బాధపడుతూ ఉంటారు. ముందు అది నమ్మకంగానే ప్రారంభమై వుండవచ్చు. మీకు అనుభవాలు వచ్చేకొద్దీ అది కేవలం నమ్మకం మాత్రమే కాకుండా అది మీ అనుభవంగా మారుతుంది. చాలామంది, వాళ్ళు తమకు ఆధారంగా ఉంటుందని ఏదో ఒక దానిని నమ్ముతూ ఉంటారు, అది వారికి ఆధారంగా ఉపయోగపడకపోయినప్పటికీ, దానిని పట్టుకొని వ్రేలాడుతూనే ఉంటారు.

**భక్తుడు** : అవును, దానికి కారణం భయం.

**గురువుగారు :** అలా అయినపుడు అక్కడ ఇంకా ఎక్కువ భయాలు ఉంటాయి. సాధారణంగా ఉండే భయాలే కాదు, తమ నమ్మకాన్ని కోల్పోతామనే భయం కూడా తోడవుతుంది. వాళ్లకుండే నమ్మకం వాళ్లకు ఆ భద్రతను ఇచ్చినపుడు అక్కడ భయానికి తావుండదు. అది వ్యక్తిత్వము చక్కగా వికసించడానికి దోహద పడుతుంది.

**భక్తుడు** : అంతకుమునుపు ఒకసారి మీరు మాట్లాడుతూ మన వ్యక్తిత్వాన్ని మన ఉనికికి ఆధారమైన దానితో కలపడం అనే విషయాన్ని ప్రస్తావించారు. దానికి మీరు బాబాను ఆధారంగా ఒక కొమ్మలాగా పట్టుకోవడమనే ఉదాహరణను ఇచ్చారు. దాని గురించి ఇంకాస్త వివరంగా చెబుతారా?

**గురువుగారు :** మీకున్న పాత నమ్మకాలు, మీరు నమ్ముతున్న సిద్ధాంతాలు ఇవన్నీ మీరు కూర్చుని ఉన్న కొమ్మలాంటివి. మీ సమస్యలు, మీ సిద్ధాంతాల భారాన్ని భరించలేక ఆ కొమ్మ ఎప్పుడైనా విరిగిపోతుందని మీరు భయపడుతున్నారు. మీకు పట్టుకోవడానికి మరో కొమ్మలేదు, మరో కొమ్మను పట్టుకోవాలనుకున్నా అది



ముందటి దానికన్నా బలహీనంగా ఉంటుందేమో అని మీరు భయపడుతున్నారు. అప్పుడు కొన్ని సంఘటనలు జరిగి మీరు సద్గురువును చేరుకుంటారు – సద్గురువు కలిగించే ప్రేరణ మీలో సరిక్రొత్త దృక్పథాన్ని ప్రేరేపిస్తుంది, అప్పుడు మీరు బలంగా కనిపించే ఆ క్రొత్త కొమ్మను (సద్గురువును) తటాలున పట్టుకుంటారు. అది బలమైనదా లేదా అనే విషయం మీకప్పటికి తెలియదు. మీరు దానిని కొంతకాలం పట్టుకున్న తర్వాత అది బలమైనది అనే విషయం అనుభవపూర్వకంగా తెలుస్తుంది, అప్పుడు మీర పాతకొమ్మను వదిలిపెట్టేస్తారు. కాబట్టి సద్గురువు రెండు పనులు చెయ్యాలి. మీ ప్రస్తుత వ్యక్తిత్వానికి, దుఃఖానికి కారణమైన నమ్మకాలను, భావాలను ధ్వంసం చేయడం ద్వారా మీరు వదిలిపెట్టలేని ఆ పాతకొమ్మ నుండి మిమ్మల్ని వేరు చెయ్యడమే కాకుండా మీ అనుభవానికి అందే స్థాయిలో మీకు అవసరమైన మరో బలమైన కొమ్మను ఆధారంగా అందిస్తారు. ఈ రెండూ జరగాలి. లేకపోతే మీరు మరింత భద్రతారాహిత్యానికి లోనవుతారు. కాబట్టి మిమ్మల్ని బలమైన కొమ్మ మీదకు మార్చడమే నా ముఖ్యలక్ష్యం. అన్ని సత్సంగాల ఉద్దేశ్యమూ అదే. మీరు పట్టుకొని ఉన్న ఆ పాత కొమ్మ బలమైనదా కాదా అన్నది నేను పట్టించుకోను. మీరు పాతకొమ్మను ఎంత బలంగా పట్టుకున్నారన్న విషయం మీదనే అంతా ఆధారపడి ఉంటుంది. మీరు దానిని గట్టిగా పట్టుకొని ఉంటే నేను ఆ కొమ్మను ధ్వంసం చేయడమనేది మరింత బలంగా ఉంటుంది (గురువుగారు నవ్వుతూ...)

**భక్తుడు :** (జీవితంలో) ప్రతి విషయమూ ముందే నిర్ణయించబడి ఉంటుందా? లేక అది కేవలం ఒక నమ్మకమేనా?

**గురువుగారు :** ఈ విషయాన్ని మీరు సిద్ధాంతంగానో లేక నమ్మకంగానో కాకుండా నిజంగా అనుభవ పూర్వకంగా తెలుసుకున్నపుడు, ప్రతిదీ ముందే నిర్ణయించబడి ఉంటుందని, అది విధివ్రాత అని మీరు చెప్పవచ్చు. నేను ఇలాంటి ధోరణిని ప్రోత్సహించను. ఎందుకంటే అది అర్ధరహితమైనది. మీ జీవితాన్ని ఆ విధంగా అనుభవించడం లేదు. ఏది ముందుగా నిర్ణయించబడిందో, అది ముందే నిర్ణయించడం ఎలా అయిందో, అది నిజంగా ముందే నిర్ణయించబడిందో, లేదా తరువాత నిర్ణయించబడిందో మీకు తెలియదు. (గురువుగారు నవ్వుతూ....) ఏదైనా ఒక సంఘటన జరిగిపోయిన తరువాత అది అలా జరిగిందని మీకు తెలిస్తే తెలియవచ్చు. అంతా ముందే నిర్ణయించబడి ఉన్నదని మీకు ఒక్క అనుభవం కూడా లేకుండా "ప్రతిదీ ముందే నిర్ణయమై పోయింద"ని మీరెలా అంటారు. అప్పుడది ఒక సిద్ధాంతగానో, మూఢనమ్మకంగానో మారుతుంది, అది మంచిది కాదు. కాబట్టి మీ అనుభవాన్ని అంటిపెట్టుకొని ఉండండి, సాధ్యమైనంత వరకు శాస్త్రీయంగా ఉండటానికి ప్రయత్నించండి. "ఇది నా అనుభవం, అది ముందే నిర్ణయింపబడిందో లేదో నాకు తెలియదు, ఒకవేళ అది ముందే నిర్ణయింపబడి ఉంటే నాకు ముందు ముందు తెలుస్తుంది".

బాబాకు తెలిసినట్టుగా ఏది ముందు నిర్ణయింపబడిందో మీకు తెలిసినట్లయితే, అప్పుడు మీరు ఆ మాట అనవచ్చు. బాబా అలా చెప్పవచ్చు ఎందుకంటే ఆయన దానికి సమర్థుడు. ఆయన అనుభవం ఆయనకు ఆ అధికారాన్ని ఇచ్చింది. కాని అది మన అనుభవం కానంతవరకు మనకు అలా చెప్పే అర్హత లేదు.



"అంతా బ్రహ్మమే. అంతా ఆత్మస్వరూపమే, అంతా బాబానే..." ఇటువంటి మెట్టవేదాంతమంతా అది మీ అనుభవం కానంతవరకు ఆత్మవంచనే. మీ అనుభవం మీద గట్టిగా నిలబడటానికి ప్రయత్నించండి. మీరేదో ఒక దానిని సాధించాలనుకుంటున్నారు. అదేదైనా సరే – మీరు బాబా గురించి ఆలోచించినపుడు, బాబాతో అనుబంధంలో ఉన్నప్పుడు మీరు ఇందులో ఏదో ఆనందాన్ని పొందుతున్నారు. దానిని అంటిపెట్టు కోవడానికి ప్రయత్నించండి. అది మీ అనుభవం. దానికి ఇతరత్రా వివరణలుగాని, సాక్ష్యాలుగాని, ఋజువులుగాని అవసరం లేదు. అది ఏ నమ్మకం మీదా ఆధారపడి లేదు. అది సత్యం. బాబా రూపం నాకు ఆ ఆనందాన్ని ఇస్తోంది. అది సుస్పష్టం. నేను నా అనుభవం మీద ఆధారపడ్డాను. వేరే నమ్మకం మీదనో, విశ్వాసం మీదనో లేక శాస్త్ర వాక్యం మీదనో, మూఢవిశ్వాసాల మీదనో ఆధారపడి లేను. ఈ కారణం వల్లనే నేను ఎప్పుడూ మీకు సిద్ధాంతాలు, తాత్విక సూత్రాలను ఇవ్వడానికి ప్రయత్నించను. మీరు మీ అనుభవం మీద స్థిరంగా నిలబడాలని నేను కోరుకుంటాను.

## సమదర్శనాన్ని సాధించు!

*విద్యావినయసంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని*
*శునిచైవ శ్వపాకే చ పండితాః సమదర్శినః (5 అ॥ 18 శ్లో॥)*

జీవనయాత్రలో మనకు విద్యావంతులు దర్శనమిస్తారు. వినయ సంపన్నులు గోచరిస్తారు. బ్రాహ్మణులు ఆశీర్వదిస్తారు. గోవులు చరిస్తాయి. ఏనుగులు కనబడుతూ ఉంటాయి. కుక్కలు, ఆ కుక్కను చంపి తినే వాళ్ళు కూడా మనకళ్లబడుతూ ఉంటారు. అయితే వీరందరిలోనూ మనం ఒకే దైవాన్ని చూడగలగాలి! వారిని చూచినపుడు ఒకేలా స్పందించగలగాలి. మన మనస్సు ఆ స్థాయికి ఎదిగిరావాలి! ఆ దర్శనంలో మనం పండాలి! అప్పుడే మనం పండితులమనబడతాం. అలా పండినవాడే పండితుడు – అని మనకు తెలియాలి.

దైవము తప్ప వేరొకటి లేదు అని మనకు తెలుసును. ఈ లోకము ఆ దైవ స్వరూపమని కూడా తెలుసు. అయితే మనం అనుక్షణం ఆ దైవాన్ని అనుభవించగలుగుతున్నామా! అన్నది ప్రశ్న. తెలియడం వేరు, అనుభవానికి రావడం వేరు. పెద్దలు చెప్పినందువల్ల వినికిడి జ్ఞానం వస్తుంది. మనకది ఒంటబట్టాలి! మనకది గోచరించాలి! మనమా అనుభూతిని చెందాలి! అప్పుడే అది నిజమయిన జ్ఞానమవుతుంది. దీనికి అభ్యాసం కావాలి. లోకంలో దైవాన్ని పొడగట్టించుకోవడం మనకు అభ్యాసం కావాలి. జీవిత నిర్వహణ సాగుతూ ఉండగానే, నిరంతర దైవ సాక్షాత్కారం కొనసాగుతూ ఉండాలి.

విద్యావంతులలో దైవాన్ని చూడటం కొంతవరకు సాధ్యం! అలాగే వినయసంపన్నులలో కూడా! లోక శ్రేయస్సును కోరి వర్తించే బ్రాహ్మణులలో కూడా దైవాన్ని చూడటంలో మనకు అభ్యంతరముండదు. ఇక గోవు దైవస్వరూపమన్నది మనకు అనాదిగా వస్తున్న విశ్వాసం. కనుక అందులో దైవాన్ని చూడటంలో మనకు అభ్యంతరముండదు. ఏనుగున్నది దాని బలం, దాని కథ చూసినపుడు ఆశ్చర్యం వేస్తుంది. కాబట్టి



దానిలో కూడా దైవాన్ని చూడవచ్చు. ఇంతవరకు బాగున్నది, ఆ ప్రక్కనే ఒక కుక్క ఉన్నది. అది మొరుగుతున్నది. దానిని ఛీ, ఛీ, పో, పో అనాలనిపిస్తుంది. దానిలో కూడా దైవాన్ని చూడాలి. అంటే మామూలు స్థితిలో కొంచెం ఇబ్బందిగానే ఉంటుంది. ఇక ఆ కుక్కను చంపితినే వాడుంటాడు. కుక్కే నీచమయింది కదా, దానిని చంపి తింటున్నాడు. వీడెంత నీచుడు, ఛీ, ఛీ వీడి మొహం చూడకూడదు. అని అనిపించే అవకాశమున్నది. ఇలా కొన్నిచోట్ల దైవాన్ని చూడటానికి కష్టసాధ్యమవుతున్నది. చెప్పేటపుడు అంతా దైవమే అని చెబుతున్నాం. చూసేటపుడు అంతటా దైవమే అనగలుగుతున్నామా? మరి ఈ వ్యత్యాసమేమిటి?

కుక్క నీచమైనదని ఎవరు చెప్పారు. అది మన భావనమాత్రమే! అలాగే గోవు మనకు దైవస్వరూపం! ఇంకొకరికి అది తినుబండారం. ఏం చెబుదాం మరి? ఇవన్నీ మనం కలిగించుకొంటున్న భావనలే! **నిజానికి అక్కడ ఉన్నది దైవం. అతడే ఇన్ని రూపాలలో గోచరిస్తున్నాడు. తిరుగాడుతున్నాడు. సృష్టికథను నడుపుతున్నాడు. సృష్టికి ఈ రూపాలన్నీ అవసరం. ఆ రూపాన్ని ధరించడానికి అతనికే అవమానమని పించనపుడు అందులో అతణ్ణి చూడటానికి మనకు సంకోచమెందుకు**? పంది ఉన్నది. అతడు పందిగా కూడా ఉన్నాడు. కాని మనం పందిని భరించలేక పోతున్నాము. అతనికి లేని అభ్యంతరం మనకేల? సృష్టికి తగిన విధంగా అతడే అన్ని రూపాలుగా ఒదిగిపోతున్నపుడు మనమెలా ప్రవర్తించాలి? అతడికి తగినట్లుగా మనం కూడా ఒదిగి ప్రవర్తించవద్దూ! సృష్టిలోని ఏ రూపాన్నీ తక్కువగా చూచినా, 'అతణ్ణి' తక్కువగా చూచినట్లే అవుతుంది. నీ రూపాన్ని కాదన్నా, 'అతణ్ణి' కాదన్నట్లే అవుతుంది. ఎవరిని మనం హేళన చేసినా, అతణ్ణి హేళన చేసినట్లే అవుతుంది. ఎవరిని త్రోసిపారేసినా అతణ్ణి త్రోసి పారేసినట్లే అవుతుంది. ఇది మనం గుర్తించాలి. గుర్తించి, తగిన విధంగా వర్తించాలి.

ఈ సత్యాన్ని మనం గ్రహించిననాడు సృష్టిలోని ఏ వ్యక్తిగాని, ఏ జంతువును గాని మనం తక్కువ చేసి చూడము. అంతటా దైవాన్నే దర్శిస్తాము. ఆయా నామరూపాలను దైవం ఎందుకు స్వీకరిస్తున్నాడో బోధపరచుకొంటాం ఇదంతా! ఆయన వైభవమని తెలుసుకుంటాం. ఎప్పుడయితే మీరు ఎవరినీ తక్కువగా చూడరో, అప్పుడు సృష్టితో మీకు ఘర్షణ ఉండదు. సృష్టిలోని సమస్యలన్నీ ఇక్కడే వస్తున్నాయి. ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ అనుకోవడంలోనే వస్తున్నాయి. ఆలోచించండి! సమస్యలకు మూలం ఇది కాదా! ఎప్పుడయితే ఎక్కువ తక్కువలు వచ్చాయో, నానావిధ ఘర్షణలు పెచ్చరిల్లుతాయి. సమాజం క్షోభిల్లుతుంది. అట్టుడికినట్లవుతుంది. అల్లకల్లోలమవుతుంది. అస్తవ్యస్థమవుతుంది. అశాంతి ననుభవిస్తుంది. గొంతెత్తి ఆక్రోశిస్తుంది. ఇంతకథా జరుగుతుంది. ఇంత కథ జరుగుతున్నది. కనుక ఎక్కువ తక్కువలు మన మనస్సునుండి జారిపోవాలి! అంతటా దైవం మనకు గోచరించాలి! ఏనుగుగా ఉన్నవాడే కుక్కగా ఉన్నాడు. యజమానిగా ఉన్న దైవమే కూలీగా కూడా పని చేస్తున్నాడు. ఈ దర్శనం మనకలవడాలి! ఎవరిపని వారు చేస్తూనే అందరూ ఒక్కటిగా బ్రతకాలి! ఎవరి పని వారు చేయకపోతే సమాజం నడవదు. అందరిలో దైవం కనబడకపోతే సమాజం నిలవదు. ఇది మనం గ్రహించాలి.

# తృప్తి



లోగడ అచ్చయి వచ్చిన ఆరవ చత్వారింశత్ ప్రూఫులు నాలుగుంటే బైండు చేయమని రాజగోపాలయ్యరుతో చెప్పారు భగవాన్. వారీ ఉదయం అన్నీ సరిచేసుకుంటుంటే చూచాను. మధ్యాహ్నం రెండున్నరకు నేను వెళ్లేసరికి అట్టలు వేయటానికి సిద్ధంగా ఉన్నారు. వారికంతా చూసి చెప్పి, ప్రక్కనున్న వైకుంఠవాసరుతో నవ్వుతూ ఇట్లా అన్నారు భగవాన్. "పోనీ, ఇవి బాగు చేస్తే నాలుగు బుక్కులవుతవి. మనం వాడుకోవచ్చును. లేకుంటే మనకు నాలుగు బుక్కులెట్లా వస్తవి? ఎవరిస్తారు? పుస్తకాలయంలో కొనుక్కోవాలి. కాసేదీ మనకు?" అందరికీ నవ్వు వచ్చింది. వైకుంఠవాసరున్నూ నవ్వారు. "ఏమయ్యా! నవ్వుతావు? నేనేం ఉద్యోగం చేసి నెల నెలా వందలకు వందలు జీతం తెస్తున్నానా? వ్యాపారం చేసి లక్షల కొద్దీ సంపాదిస్తున్నానా? నాకేదీ కాసు? మనకేం స్వతంత్ర్యమున్నది? దాహం కావాలంటే నీళ్లకు మిమ్మల్ని అడగాలి. పోనీ వంటింట్లోకి వెళ్లి అడుగుదామంటే, 'ఓహో, యీ స్వామి అధికారం చేయటానికారంభించాడే?' అంటారు. నోరెత్తగూడదు. మనకేం స్వాతంత్ర్యమున్నదయ్యా" అన్నారు భగవాన్.

తాము సర్వస్వతుంత్రులయ్యి ఇట్లా అన్నారంటే మన బోంట్లకు తాకి రావాలనేగాని వేరేముంది చెప్పు. ఇదేకాదు. మనమెప్పుడూ అది కావాలి, ఇది కావాలని కోర్కెలకు వశమై ఆహారాదులలో నియతి లేకుండా, యాచించో, అధికారాన్ని ఉపయోగించో స్వేచ్ఛగా ప్రవర్తిస్తాం. భగవాన్ ఆ విషయాలలో అధికారం నిరసించుటేగాక, యాచనము కూడదని నిర్ధేశించినట్లు ప్రవర్తించిన మరొక విషయం ఉంది. ఏమంటే, రెండు మూడేళ్ల క్రిందట ఒకనాటి ఉదయం నేను హాల్లోకి వెళ్లేసరికి, సాత్వికాహారాన్ని గురించి కృష్ణస్వామి, యేమో అడుగుతూ ఉంటే, భగవాన్ ఇట్లా అంటున్నారు. "నేను విరూపాక్ష గుహలో ఉండగా అవసరాన్ననుసరించి సుందరేశయ్యర్ భిక్షకు వెళ్లి ఊళ్లో నుంచి అన్నం తెచ్చేవారు. ఒక్కొక్క రోజున ఆ భిక్షాన్నంలో కూరా, నారా ఏమీ ఉండేది కాదు. జనం జాస్తీగా ఉండేవారు. అన్నం కొద్ది ఏం చేసేది? ఆ అన్నం నేనే బాగా పిసికి వేడినీళ్లు పోసి, జావల్లే చేసి, అందరికీ ఒక్కొక్క గ్లాసెడు ఇచ్చి, నేనూ ఒక గ్లాసెడు తాగబోతే, ఉప్పయినా ఉంటే బాగని తోచేదందరికి. కొనుక్కుందామంటే కాసేదీ? ఎవరినైనా ఉప్పు కావాలని అడగాలి. అడగటం ప్రారంభిస్తే, ఉప్పడగిన నోట పప్పడగాలనీ, పప్పడిగితే పాయసం కావాలని అనిపిస్తుంది. కాబట్టి ఆ తలపే కూడదని అట్లాగే త్రాగేవాళ్లం. ఎంతో హాయిగా ఉండేది. ఉప్పు కూడా లేని సాత్వికాహారం గనుక శరీరానికి సుఖమే గాక, మనస్సుకునూ ఎంతో తృప్తిగా ఉండేది".

"ఉప్పు కూడా రాజసపదార్థాలలో చేరిందేనా?" అన్నా నేను. "ఆహా సందేహమేమి? అదేదో గ్రంథంలో ఉన్నది. చూచి చెపుతానుండండి" అన్నారు భగవాన్. "భగవాన్ చెపితే చాలదా? గ్రంథమెందుకు?" అన్నాను. ఉప్పు మానటం చేతకాలేదు సరిగదా, కాస్తకారం కూడా వంటికి పడితే బాగని తోస్తున్నది. ఇట్లా ఉన్నవి మన ఆహారాది నియమాలు, నిష్ఠలూను. మహానుభావులు లోకోపకారార్థం బ్రతకడానికి తింటారు. మనమేమో తింటానికి బ్రతుకుతాం. ఇదే వ్యత్యాసం. బ్రతకటానికి తింటే రుచులతో పనిలేదు. తినటానికి బ్రతికితే ఎన్నో రుచులు. ఆ రుచుల కోసం ఎన్నో తిప్పలూను. ***(శ్రీరమణాశ్రమ లేఖలనుంచి)***





# సాయిపథ స్వర్గసీమలో సురేంద్రుడు

పూజ్య గురుదేవులు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీగారి తండ్రిగారు, శ్రీసాయిభక్తుల స్మృతి వాఙ్మయమైన “శ్రీసాయిభక్త అనుభవ సంహిత” గ్రంథకర్త శ్రీసాయినాథుని సురేంద్రబాబుగారు శ్రీసాయిలో సాయుజ్యమయ్యారు. ఉపాధ్యాయవృత్తికి తమ మహోన్నత ప్రవృత్తిని మేళవించి, గురుపీఠానికే వన్నె తెచ్చిన అరుదైన వ్యక్తిత్వం, వినూత్న ఆలోచనలు, ఉదాత్తమైన భావాలతో నిండిన స్ఫూర్తిదాయకమైన శ్రీ సురేంద్రబాబుగారి జీవితయాత్ర ఆగష్టు 17, 2013నాడు పరిసమాప్తమయ్యింది. తాను శ్రీసాయిబాబాకు దాసానుదాసుడుగా భావించి ‘సాయిదాసు’ నామధేయంతో శ్రీసాయిని అక్షర సుమాలతో అర్చించిన ఆ కలం, సద్గురు కావ్యంలో ఎన్నో మధుర జ్ఞాపకాల సంపుటలను సువర్ణాక్షరాలతో లిఖించి పరిపూర్ణమయ్యింది. తన స్వంత బిడ్డనే సద్గురువుగా భావించి, సేవించి, తరించే అరుదైన మహద్భాగ్యాన్ని పొందిన సాయిపథ వసుధైక కుటుంబ పితామహులైన (తండ్రికి తండ్రి) సాయిదాసునికి సాయిపథ కుటుంబమంతా నీరాజనాలు పడుతోంది. శ్రీసాయి సాహితీసేవలో పునీతులై, ఉపాధ్యాయ వృత్తిలో కృతార్థులై, సద్గురు పదసన్నిధి చేరి చరితార్థులైన శ్రీసురేంద్రబాబుగారికి ‘గురుకృప’ ఘనంగా నివాళులు అర్పిస్తూ, శిరస్సు వంచి ప్రణమిల్లుతోంది.

# అవ్యాజమైన ప్రేమ

దేనిపట్ల ఆధారపడకుండా, ఎటువంటి మోటివేషన్ లేకుండా, ఎటువంటి అంచనాలు లేకుండా ఉండేటటువంటిది. అది దేంట్లోంచి పుట్టదు. దీంట్లో నుంచి, దాంట్లోనుండి పుట్టటం కాదు. ఎందుకు కలిగిందో తెలియదు, Some how the love is triggered. Why? తెలియదు మనకు. ఆ తెలియకపోవటంలోనే ఉంది మిస్టరీ అంతా. తెలిసిందా, మళ్ళా అది ప్రేమ కాదు మళ్ళా...

తొంభై శాతం మంది చెప్పలేరు. గురువుగారంటే మీకు ఎందుకు ఇష్టం అంటే, బాబా అంటే నాకెందుకంత ప్రేమ అని నేను చెప్పలేను. ఎందుకో ఇష్టం నాకంతే. ఆయన శక్తిమంతుడనా? ఆయన దేవుడనా? నాకు తెలియదు ఆయన దేవుడని. ఆయన దేవుడు కాకపోయినా ఇష్టమే. ఆయనకు శక్తులున్నాయనా? లేకపోయినా ఇష్టమే. అసలు ఆయన చరిత్ర నాకు తెలియనప్పుడే ఇష్టం. అలా ఎందుకో తెలియకుండా ఈ ఫలానా దాంట్లోంచి పుట్టింది అని చెప్పకుండా వుండేటటువంటి ప్రేమ.

నువ్వు చెప్పయ్యా! నేనంటే నీకెందుకు ఇష్టమో, చెప్పలేవు. నీవల్ల కాదది. చెప్పావో, అది అవ్యాజమైన ప్రేమ కాదు. నేనా రోజున ఫలానిది అడిగాను గురువుగారూ, మీరు నాకిచ్చారు. నాకా అనుభవం వచ్చింది. నేను ఉద్యోగం అడిగాను, ఉద్యోగం ఇచ్చారు, నాకు ఆరోగ్యం బాగాలేదని ఆరోగ్యం తీర్చారు. అందుకని మీరంటే ఇష్టం. వెరీగుడ్. క్లియర్. మనిద్దరి మధ్య డీలింగ్స్ క్లియర్‌గా వున్నాయని అర్థం. అవి ఇయ్యకపోతే పోద్దని అర్థం అది. నెక్స్ట్ నువ్వు ఎప్పుడన్నా అడిగావంటే ఏదన్నా నేనివ్వకపోతే పోయిందని అర్థం నీకు. నాకు రిజైన్ చేసేస్తావు. నేను మొదటి నుంచి క్లారిటీ వుంది నాకు, అందువల్ల, అందువల్ల నాకు మీ మీద ప్రేమ. అది లేనప్పుడు మీమీదెందుకు ప్రేమ అంటావు. ఎందుకో తెలియదు. Some how the love is triggered, why we do not know. That is what I say in the satsangs, that, when we see Baba, where you feel that he is so strange, but he is so familiar. నాకు బాబాను చూస్తే అలా అనిపించేది. చాలామంది అడిగేవాళ్ళు, ఎట్లా ఎన్నుకోవాలి? ఫలానా వ్యక్తి నా గురువని ఎలా తెలుస్తుంది. ఇది ఒక్కటే దానికి లెక్క. You feel it so strange. అసలు ఆయన గురించి ఏమీ అర్థం కాదు. But it same time, you feel so familiar. ఈయన అబ్బా! నాకెప్పటినుంచో తెలుసయ్యా అనిపించేటట్టుండాల, అంత చనువుగా ఉండాల. అంత క్లోజ్‌గా ఉంటుంది. At the same time we dont know any thing about him.

అంత స్ట్రేంజ్‌గా, అంత మిస్టీరియస్‌గాను వుంటుంది. He is a familiar stranger & strangely familiar. అట్లా నీకు ఏ రూపాన్ని చూస్తే ఆ అనుభూతి కలుగుతుందో, ఆ స్ట్రేంజ్‌గా, ఫెమిలియర్‌గా ఉంటేటటువంటి ఆ అనుభూతి వుంది, చూశావా... అది అట్లా డ్రా చేస్తుంది నిన్ను ఆ రూపం వైపుకి. ఆ డ్రాయింగ్‌ని ప్రేమ అన్నాము. ఎందుకో తెలియదు. ఆ స్ట్రేంజ్‌నెస్‌ని పోగొట్టుకోవాలని అనిపిస్తుంటుంది. అందుకని ఇంకా మళ్ళా, మళ్ళా చూడాలి. ఇంకా ఇంకా మనకు ఇంటర్వ్యూ కావాలనిపిస్తుంటుంది. పోతుందా పోనీ. నాలుగుసార్లిస్తే పోతుందా ఆ స్ట్రేంజ్‌నెస్. ఐదుసార్లిస్తే పోతుందా ఆ స్ట్రేంజ్‌నెస్, పోదది.

నేను నలభై ఏళ్ల నుంచి, నలభైఐదేళ్ల నుంచి బాబాను చూస్తూనేవున్నా ఇంకా స్ట్రేంజ్‌గానే ఉన్నాడు నాకాయన. అంత ఫెమిలియర్‌గానూ ఉన్నాడు. అది అవ్యాజమైన ప్రేమంటే.

శ్రీబాబూజీ



దీపాలను వెలిగించి ద్వారకామాయిలోని చీకట్లను పారద్రోలిన సాయి - 60 సం॥లపాటు
అక్కడే మానవాళి హృదయాలలో అజ్ఞానపు చీకట్లను పారద్రోలే లీలలను ప్రదర్శించి దైవం పట్ల
విశ్వాసాన్ని నింపే సుజ్ఞాన దీపాలను వెలిగించారు.
మన హృదయాలలో ఆయన వెలిగించిన 'లీలా' దీపాల వెలుగులు చిమ్మిన క్షణాలన్నీ ఆయనపట్ల
మనముంచవలసిన అచంచల విశ్వాసానికి పునాదులవుతాయి.
ఆ సుజ్ఞాన దీపాలను రగిలించుకునేందుకు ప్రజ్వలింప చేసుకునేందుకు, అవసరం - సత్సంగమనే చిమ్మి.

- శ్రీ బాబూజీ